

అమ్మాయిలదే హవా

'పది' ఫలితాల్లో జిల్లాలో పెరిగిన ఉత్తీర్ణత

- ప్రథమశ్రేణి ఫలితాలే ఎక్కువ..
- పరీక్షలకు హాజరైన విద్యార్థులు 23,163
- ఉత్తీర్ణత సాధించింది : 18,549
- ఉత్తీర్ణులలో బాలురు 8,513 మంది.. బాలికలు 10,036 మంది
- నేటి నుంచే ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు : డీఈవో

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 22 : పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో జిల్లా విద్యార్థులు మంచి ఉత్తీర్ణతనే సాధించారు. గతేడాది ఉత్తీర్ణత కంటే 16 శాతం పెంచుకుని మొత్తంగా 80 శాతం ఫలితాలను సాధించగా, రాష్ట్రంలోని 26 జిల్లాల ఉత్తీర్ణతతో పోల్చితే అట్టడుగున 25 స్థానంతో సరి పెట్టుకోవాల్సి వచ్చింది. ఏలూరు జిల్లాలో ఎక్కడా మాస్ కాపీయింగ్‌కు, మాల్‌ప్రాక్టీస్‌కు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించిన ఈ పరీక్షల్లో ఇవే నాణ్యతతో కూడిన ఫలితాలుగా జిల్లా విద్యాశాఖ పేర్కొంది. టీచర్ల సమష్టి కృషి కారణంగానే ఈ ఉత్తీర్ణతను సాధించినట్టుగా డీఈవో అబ్రహం వారిని అభినందించగా, భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ప్రయత్నించాలని సూచించారు. ఈ ఏడాది టెన్త్ పరీక్షలకు జిల్లాలో మొత్తం 23,163 మంది బాలబాలికలు హాజరుకాగా, వీరిలో 18,549 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణుల్లో బాలురు 8,513 మంది (75.86శాతం), బాలికలు 10,036 మంది (84.05 శాతం) ఉన్నారు. ఇక ప్రభుత్వ యాజమాన్యంలోని పాఠశాలల్లో ఫెయిలైన విద్యార్థులకు మే 24 నుంచి జూన్ 3 వరకు జరిగే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఆయా సబ్జెక్టుల్లో తర్ఫీదునిచ్చేందుకు ప్రత్యేక తరగతులను ఆలస్యం చేయకుండా మంగళవారం నుంచే ప్రారంభిస్తున్నట్టు డీఈవో వెల్లడించారు. పరీక్ష పేపర్లు సులువుగా ఉండడం వల్లే ఉత్తీర్ణత పెరగడానికి ఓ కారణమని భావిస్తున్నట్టు ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ శ్రీకాంత్ విశ్లేషించారు.

పోటా పోటీగా ఫస్ట్‌క్లాసులు!

మొత్తం ఉత్తీర్ణుల్లో ఏకంగా 13,851 మంది విద్యార్థులు ప్రథమశ్రేణి సాధించడం విశేషం. ద్వితీయశ్రేణిలో 3,116 మంది, తృతీయ శ్రేణిలో 1,582 మంది ఉన్నారు. జిల్లాలోని 28 మండలాల్లో వేలేరుపాడు 91.16 శాతం ఉత్తీర్ణతతో అగ్రస్థానంలో ఉండగా, ఆ తదుపరి స్థానాల్లో నూజివీడు, చాట్రాయి, లింగపాలెం, టి.నరసాపురం మండలాలుండగా, 60-70 శాతం ఫలితాలతో జీలుగుమిల్లి, మండవల్లి, దెందులూరు, నిడమర్రు మండలాలు వెనుకబడ్డాయి. యాజమాన్యాల వారీగా ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్ 3, కేజీబీవీ 1, ప్రైవేటు 73, ట్రైబల్ వెల్ఫేర్, జడ్పీ ఒక్కొక్క స్కూలు చొప్పున నూరుశాతం ఉత్తీర్ణతను నమోదు చేసుకున్నాయి. డివిజన్ల వారీగా ఫలితాలను విశ్లేషిస్తే నూజివీడు డివిజన్ 2,683 మంది ఉత్తీర్ణులతో 85.20 శాతం ఫలితాలతో ప్రథమస్థానం, ఏలూరు డివిజన్ పాఠశాలలు 10,979 మంది బాలబాలికల ఉత్తీర్ణతతో 80.49 శాతం ఫలితాలను సాధించి ద్వితీయ స్థానంలో నిలిచాయి, కొయ్యలగూడెం డివిజన్ 3,532 మంది ఉత్తీర్ణులతో 79.12 శాతం, తాడేపల్లిగూడెం డివిజన్ పాఠశాలలు 1,355 మంది ఉత్తీర్ణులతో 70.94 శాతం ఫలితాలను సాధించాయి.

ఆ మూడు సబ్జెక్టుల్లోనే ఫెయిల్యూర్స్ ఎక్కువ

జిల్లాలో నూరుశాతం ఉత్తీర్ణతను 79 పాఠశాలలు సాధించగా, 50 శాతం కంటే తక్కువ ఉత్తీర్ణతతో 14 పాఠశాలలు సరిపెట్టుకున్నాయి. నూరుశాతం ఉత్తీర్ణతను సాధించిన ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో నాగిరెడ్డిగూడెం ఏపీ రెసిడెన్షియల్ బాలికోన్నత పాఠశాల, ముసునూరు ఏపీ రెసిడెన్షియల్, అప్పలరాజుగూడెం ఏపీ బాలుర రెసిడెన్షియల్, వేలేరుపాడు కేజీబీవీ, లంకాలపల్లి ట్రైబల్ వెల్ఫేర్, వీరమ్మకుంట జడ్పీ హైస్కూలు, కుక్కునూరు కేజీబీవీ, కేతవరం జడ్పీహెచ్‌ఎస్, వేదాంత పురం జడ్పీహెచ్‌ఎస్, చింతలపూడి ఏపీ సోషల్‌వెల్ఫేర్ బాలుర ఉన్నతపాఠశాలలు టాప్ టెన్ స్థానాల్లో నిలిచాయి. ఉత్తీర్ణతలో హిందీ సబ్జెక్టులో 22,202 మంది విద్యార్థులు, ఇంగ్లీషులో 21,922 మంది, తెలుగులో 21,069 మంది విద్యార్థులుండగా, సైన్సు సబ్జెక్టులో 19,470 మంది, గణితంలో 20,024 మంది, సోషల్ స్టడీస్‌లో 20,684 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎక్కువగా ఫెయిలైన విద్యార్థుల్లో సైన్సులో 3693 మంది, గణితంలో 3,139, సోషల్ స్టడీస్‌లో 2,479మంది ఉన్నారు.

30లోగా రీకౌంటింగ్/రీవెరిఫికేషన్‌కు గడువు

రీకౌంటింగ్/రీవెరిఫికేషన్‌కు ఆన్‌లైన్‌లో ఈనెల 30వ తేదీలోగా నిర్ణీత రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని డీఈవో అబ్రహం తెలిపారు. ఫెయిలైన విద్యార్థులను సప్లిమెంటరీ పరీక్షలకు సమాయత్తం చేసేందుకు మంగళవారం నుంచి సంబంధిత స్కూళ్లలోనే ప్రత్యేక తరగతులను ఆయా సబ్జెక్టుల టీచర్లు నిర్వహిస్తారని వివరించారు. ఈ తరగతుల నిర్వహణకు ప్రధానోపాధ్యాయులు, ఉప విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.


594
టి.ఆర్. సాయి శ్రీదేవి, లిటిల్‌బడ్స్ హైస్కూలు, ఏలూరు


594
కె.శాంతి, దీప్తి స్కూలు, ఏలూరు


592
కె.ప్రవల్లిక, దీప్తి స్కూలు, ఏలూరు


592
సీహెచ్.కావ్యశ్రీ, ఎల్‌బీసీ స్కూలు, ఏలూరు


591
జె.శ్రీరామ్, శ్రీ చైతన్య స్కూలు, ఏలూరు


588
ఎం. మహేష్‌బాబు, జడ్పీ హైస్కూలు, శనివారపుపేట,

ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్..వందకు వంద పాస్

ప్రభుత్వ యాజమాన్యంలోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్ విద్యార్థులు పరీక్షలకు హాజరైన 234 మంది బాలబాలికలు మొత్తం ఉత్తీర్ణులై తొలివరుసలో ఉన్నారు. మొత్తం ఉత్తీర్ణతలో బీసీ వెల్ఫేర్ స్కూల్స్ 96.15 శాతంతో ద్వితీయస్థానం, కేజీబీవీలు 95, ఏపీ సోషల్ వెల్ఫేర్ 91.24, ఎయిడెడ్ 80.26, ట్రైబల్ వెల్ఫేర్ 74.97, జిల్లా పరిషత్ 69.83, మున్సిపల్ 67.99, గవర్నమెంట్ 66.72శాతం ఉత్తీర్ణతతో ఆ తదుపరి స్థానాలను నిలబెట్టుకున్నాయి. జిల్లాలోని ప్రైవేటు అన్‌ఎయిడెడ్ పాఠశాలల నుంచి టెన్త్ పరీక్షలకు మొత్తం 7918 మంది హాజరుకాగా వీరిలో 7,605 మంది (96.05 శాతం) ఉత్తీర్ణులయ్యారు. పాసైనవారిలో బాలురు 3,952 మంది, బాలికలు 3,653 మంది ఉన్నారు. జిల్లాకు లభించిన మొత్తం ఉత్తీర్ణతలో ప్రైవేటు పాఠశాలలు మూడో స్థానంలో ఉన్నాయి.

ప్రభుత్వ పాఠశాలల్లో టాపర్లు వీరే

ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో జడ్పీ మేనేజ్‌మెంట్ హైస్కూళ్లు, ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్ విద్యార్థులు టాపర్లుగా నిలిచారు. ఏలూరు శనివారపుపేట జడ్పీ హైస్కూలు విద్యార్థి మురాల మహేష్‌బాబు 588 అత్యుత్తమ మార్కులు సాధించగా, ఆ తర్వాత గూటాల జడ్పీ హైస్కూలు విద్యార్థిని గ్రే సాయి తన్మయి 587, కైకరం స్కూలు శానం నందినిప్రియ 587, చిన్నంపేట స్కూలు (చాట్రాయి) విద్యార్థి జుజ్జురు యశ్వంత్ 586, పూళ్ల స్కూలు పులి వెంకటగాయత్రి 585, అప్పలరాజుగూడెం ఏపీ రెసిడెన్షియల్ తిరిమిల్లి జగన్నాథం 584, నాగిరెడ్డిగూడెం స్కూలు ఎం.అనురాధ లక్ష్మీఐశ్వర్య, కస్సే హనీ 584, నూజివీడు స్కూలు బెజవాడ ప్రేమచంద్రిక 584, వడలి జడ్పీ స్కూలు ప్రేమిరెడ్డి దీక్షిత 583, నూజివీడు గరల్స్ స్కూలు బత్తుల భువన 583, గణపవరం స్కూలు నభిగారి మేఘన 583, నూజివీడు గరల్స్ స్కూలు షేక్ షబానా మెహరాజ్ 583మార్కులతో టాపర్లుగా నిలిచారు.

'పది' చరిత్రలో ఆల్ టైం హై రికార్డు

మనస్విదే !



ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 22 : పదో తరగతి పరీక్షల్లో ఏకంగా 599 మార్కులను సాధించి తెలుగు రాష్ట్రాల్లో, ఎస్ఎస్‌సీ పరీక్షల చరిత్రలో ఆల్ టైం హై రికార్డును సొంతం చేసుకున్న ఆకుల వెంకటసాయి మనస్వి సరికొత్త అధ్యాయాన్ని సృష్టించింది. ఒక్క హిందీ సబ్జెక్టులో వందకు 99 మార్కులు రాగా, మిగతా అన్ని సబ్జెక్టుల్లో వందకు వంద మార్కులతో స్టేట్ టాపర్‌గా రికార్డులను తిరగరాసింది. మనస్వి సాధించిన రికార్డు సోమవారం తెలుగు రాష్ట్రాల్లో మారుమోగిపోయింది. ఈమెకు వచ్చిన మార్కులు ప్రతీ ఒక్కరినీ షాక్‌కు గురిచేసాయి. మనస్వి తల్లిదండ్రులిద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులే. తండ్రి ఏ.ఎన్.వి.ప్రసాద్ నూజివీడు మండలం అన్నవరం మండల పరిషత్ పాఠశాలలో ఎస్టీటీగా గతేడాది నుంచి ఎంటీఎస్ విధానంలో పనిచేస్తుండగా, తల్లి శైలజ చాట్రాయి మండలం సోమవరం మండల పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. ఈ దంపతుల ఏకైక కుమార్తె మనస్వి.

టెక్స్ట్ బుక్ పఠనంతోనే ఈ విజయం

మనస్వి నూజివీడు నారాయణ టెక్నో స్కూలులో ఎల్‌కేజీ నుంచి చదువుతోంది. ఈమె పదో తరగతిలోకి ప్రవేశించిన నాటి నుంచి చదువుకు ఆటంకం కాకూడదన్న ఆలోచనతో తల్లిదండ్రులిద్దరూ తమ స్వగ్రామం నుంచి నూజివీడుకు నివాసాన్ని మార్చుకున్నారు. తండ్రి నిత్యం తమ కుమార్తెను స్కూలు వద్ద మోటారు బైక్‌పై దించిన అనంతరం తన స్కూలు విధులకు వెళ్ళి, తిరిగి వచ్చేటపుడు ఇంటికి తీసుకొచ్చేవారు. తమ కుమార్తె ఘన విజయంపై తల్లిదండ్రులు పంచుకుంటూ 'మా అమ్మాయి కేవలం టెక్స్ట్ బుక్స్‌తోనే ప్రిపేర్ అయింది. ప్రతీ పాఠ్యాంశంపైనా ఏకాగ్రత పెంచుకుని సొంతంగా ప్రశ్నలు, బిట్స్ తయారు చేసుకోవడం, ముఖ్యమైన ప్రశ్నలు, వాటికి సంబంధించి పాఠ్య పుస్తకంలో లైన్లను రాసుకునేది. ప్రశ్నల సరళిని గమనిస్తుండేది. చదువుపై మేం ఏనాడూ ఒత్తిడి పెట్టలేదు. స్కూల్‌లో ఫస్ట్ రావాలని మాత్రం ప్రోత్స హించేవాళ్లం. టెన్త్ పరీక్షలు ఏ రోజుకారోజు ముగిసిన వెంటనే ఆ పరీక్షలో వంద మార్కులు వస్తాయని ఎంతో ధీమాగా చెప్పేది. మేమైతే 585-590 మార్కులు వస్తాయని ఊహిం చాం. ఇంటర్‌లో ఎంపీసీ లేదా ట్రిపుల్ ఐటీలో చేర్చాలనుకుంటున్నాం' అని వివరించారు.

నామినేషన్ కౌంటర్ (4వ రోజు)

ఎంపీ/ఎమ్మెల్యే నియోజకవర్గాలు	నాలుగో రోజు నామినేషన్లు	మొత్తం
ఏలూరు ఎంపీ	05	08
1.ఉంగుటూరు	02	04
2.దెందులూరు	03	05
3.ఏలూరు	01	03
4.పోలవరం	02	05
5.చింతలపూడి	03	06
6.నూజివీడు	02	07
7.కైకలూరు	05	09
మొత్తం	18	39
నరసాపురం ఎంపీ	01	07
1.ఆచంట	01	05
2.పాలకొల్లు	01	06
3.నరసాపురం	03	05
4.భీమవరం	02	03
5.ఉండి	03	07
6.తణుకు	02	08
7.తాడేపల్లిగూడెం	00	03
మొత్తం	12	37

పవన్ కల్యాణ్ పర్యటన వాయిదా

భీమవరం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ పర్యటన వాయిదా పడింది. రెండు రోజులపాటు పవన్ కల్యాణ్ పర్యటించాల్సి ఉంది. తొలిరోజు ఆదివారం నర్సాపురం, భీమవరం సభల్లో పాల్గొన్నారు. సోమవారం తాడేపల్లిగూడెం, గణపవరం పర్యటన ఖరారైంది. అయితే పవన్ పయనించే హెలికాప్టర్ మరమ్మతులకు గురికావడంతో పర్యటనను వాయిదా వేసుకున్నారు. పిఠాపురంలో మంగళవారం జనసేనాని నామినేషన్ దాఖలు చేయనున్నారు.

డీఎల్ఎడ్ పరీక్షకు 112 మంది హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 22 : సోమవారం జరిగిన డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎల్ఎడ్) మూడో సెమిస్టర్ పరీక్షకు 112 మంది విద్యార్థులు హాజరుకాగా, ఐదుగురు గైర్హాజరయ్యారని డీఈవో అబ్రహం తెలిపారు. మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.

ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ పరిశీలన

ఏలూరు సిటీ, ఏప్రిల్ 22 : రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏలూరు జిల్లాలో ఎన్నికల నిర్వహణ సన్నద్ధతను పరిశీలించేందుకు సోమవారం సాయంత్రం రాష్ట్ర ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనా నిగమ్ ఏలూరు విచ్చేశారు. తొలుత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ మీడియా కంట్రోల్ రూమ్ నిర్వహణ తీరుపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. మీడియాలో ఎన్నికల ఏర్పాట్లు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై వచ్చే ప్రతికూల వార్తలను నమోదు చేసే విధానం వాటి పరిష్కార తీరును ఆరా తీశారు. కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ వివరాలను తెలిపారు. జిల్లాలో ఎన్నికల సన్నద్ధత ఏర్పాట్లపై కలెక్టర్‌తో పాటు ఎస్పీ మేరీప్రశాంతి వివరించారు. డీఆర్వో పుష్పమణి, జడ్పీ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో హత్య

పెదవేగి, ఏప్రిల్ 22 : కుటుంబ కలహాలు ఓ వ్యక్తి హత్యకు దారితీశాయి. పెదవేగి ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్, స్థానికులు తెలిపిన వివరాలివి. పెదవేగి మండలం భోగాపురానికి చెందిన పామర్తి రంగారావు (44), మండపాక వరప్రసాద్‌లు మేనత్త, మేనమామ కుమారులు. ఆ రెండు కుటుంబాల మధ్య వివాదాలు నడుస్తున్నాయి. సోమవారం ఉదయం పదిన్నర గంటల సమయంలో రహదారిపై వెళ్తున్న రంగారావును కూల్ డ్రింక్ షాపులో ఉన్న వరప్రసాద్ పిలిచి, ఏంటీ దుర్భాషలాడుతున్నావంటూ ప్రశ్నిస్తూ, ఒక్కసారిగా జేబులో నుంచి చాకు తీసి నాలుగైదు పోట్లు పొడిచాడు. రంగారావు తీవ్రరక్తస్రావంతో మృతి చెందాడు. వరప్రసాద్ ద్విచక్రవాహనంపై అక్కడ నుంచి పారిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులకు సమాచారం అందించారు. శవపంచనామా నిర్వహించి, శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యు లకు అప్పగించామని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

అట్టహాసంగా పుట్టా నామినేషన్

- వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు
- ఏలూరులో భారీ ర్యాలీ..

ఏలూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : కూటమి అభ్యర్థిగా ఏలూరు లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ అట్టహాసంగా సోమవారం తన నామినేషన్ దాఖలు చేశారు. తొలుత ఆయన జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి వచ్చి నామినేషన్‌ను కార్యకర్తల సమక్షంలో పూర్తి చేశారు. ఆ తర్వాత పాతబస్టాండ్ సమీపాన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పోలవరం, చింతలపూడి, దెందులూరు, ఏలూరు, నూజివీడు, కైకలూరు, ఉంగుటూరు నియోజకవర్గాల నుంచి పెద్దసంఖ్యలో టీడీపీ కార్యకర్తలు, నేతలు, మిత్రపక్షాల కేడర్ ఏలూరుకు చేరుకుంది. వీరంతా ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌కు అనుకూలంగా నినాదాలు చేస్తుండగా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ చేశారు. అడుగడుగునా కార్యకర్తలు ఎదురేగడమే కాకుండా మహేష్‌కు అనుకూల నినాదాలతో హోరెత్తించారు. ప్రత్యేక వాహనంపై మహేష్‌కుమార్‌తో పాటు ఆయన సోదరుడు పుట్టా రవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఏలూరు అసెంబ్లీ కూటమి టీడీపీ అభ్యర్థి బడేటి చంటి, జనసేన ఇన్‌చార్జ్ రెడ్డి అప్పలనాయుడు, పోలవరం కూటమి జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజు, బీజేపీ నేతలు అంబికా కృష్ణ, మాలతీరాణి, టీడీపీ నేతలు మధ్యాహ్నపు బలరామ్, కడియాల విజయలక్ష్మి వంటి వారంతా అనుసరించారు. కలెక్టర్, ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్‌కు పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ రెండుసెట్ల నామినేషన్లు అందించారు. ఆయన సోదరుడు పుట్టా రవి ఇంకోసెట్టు నామినేషన్ వేశారు. వీరి వెంట కామినేని శ్రీనివాస్, చింతమనేని ప్రభాకర్, గన్ని వీరాంజనేయులు, రెడ్డి అప్పలనాయుడు ఉన్నారు. మహేష్ నామినేషన్ కార్యక్రమంలో కూటమి పక్షాన పెద్దసంఖ్యలో కార్యకర్తలు నగర వీధుల్లో పార్టీ జండాలు చేతపట్టి, ఎన్నికల పండుగను గుర్తు చేశారు.



మహేష్‌కు అభిమానుల భారీ గజమాల..


నామినేషన్ పత్రాలను కలెక్టర్‌కు ప్రసన్న వెంకటేష్‌కు దాఖలు చేస్తున్న కూటమి ఎంపీ అభ్యర్థి మహేష్ కుమార్ యాదవ్


ర్యాలీలో ఎంపీ అభ్యర్థి మహేష్‌కుమార్ యాదవ్, గన్ని వీరాంజనేయులు, కామినేని శ్రీనివాస్, బడేటి చంటి, చిర్రి బాలరాజు, రెడ్డి అప్పలనాయుడు

టీడీపీ ప్రభంజనంలో వైసీపీ కొట్టుకుపోవడం ఖాయం..

రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో రోజురోజుకు పెరుగుతున్న టీడీపీ ప్రభంజనంలో వైసీపీ కొట్టుకుపోవడం ఖాయమని, అఖండ మెజార్టీతో విజయం సాధిస్తానని మహేష్ కుమార్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. నామినేషన్ అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఏపల్లెకు వెళ్ళినా ప్రజలు టీడీపీ కూటమి అభ్యర్థులకు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ రాక్షస పాలనను తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ప్రజా మద్దతు తమకే ఉందన్నారు.


నామినేషన్ దాఖలు చేస్తున్న చింతలపూడి టీడీపీ అభ్యర్థి రోషన్‌కుమార్

ఎంపీకి 5, ఎమ్మెల్యే 18

జిల్లాలో నాలుగో రోజు నామినేషన్లు

ఏలూరు సిటీ/దెందులూరు/బుట్టాయగూడెం/చింతలపూడి/నూజివీడు/ కైకలూరు/ఉంగుటూరు, ఏప్రిల్ 22 : ఏలూరు జిల్లాలో సోమవారం ఏలూరు పార్లమెంట్‌కు 5, జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు 18 నామినేషన్లు దాఖలయ్యాయి. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గానికి కూటమి టీడీపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ రెండు సెట్లు, ఆంధ్రరాష్ట్ర ప్రజా సమితి పార్టీ అభ్యర్థిగా రుద్రపాక రత్నారావు ఒక సెట్, పుట్టా రవికుమార్ యాదవ్ ఒక సెట్ నామి నేషన్లు దాఖలు చేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా కొమ్మిన అగస్టీన్ ఒక సెట్, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మెండెం సంతోష్‌కుమార్ నామినేషన్లు దాఖలు చేశారు. దెందులూరు నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా చింతమనేని ప్రభాకర్ ఆర్వో లావణ్యవేణికి నామినేషన్ పత్రాలు అందించారు. తొలుత వేలాది మందితో చింతమనేని దుగ్గిరాల నుంచి ఏలూరు ఫైర్ స్టేషన్, పాత బస్టాండ్, ఆశ్రం, జాతీయ రహదారి మీదుగా దెందు లూరుకు ర్యాలీగా వచ్చారు. చింతమనేని ప్రభాకర్‌రావు కుమార్తె వంకినేని సాయి నవ్యశ్రీ ఇండిపెండెంట్‌గా, బహుజన సమాజ్‌వాది పార్టీ అభ్యర్థిగా నేతల రమేష్ బాబు నామినేషన్లు దాఖలు చేశారు. ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి రిఫార్మ్స్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా షేక్ హుస్సేన్, పోలవరం అసెంబ్లీ నియోజకవర్గానికి సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ అభ్యర్థిగా సరియం రామ్మోహన్, స్వతంత్ర్య అభ్యర్థిగా కారం మల్లేశ్వరరావు కేఆర్‌పురం ఐటీడీఏలో ఆర్వో ఎం.సూర్యతేజకు నామినేషన్లు దాఖలు చేశారు. చింతలపూడి కూటమి అభ్యర్థిగా సొంగా రోషన్ కుమార్ రెండు సెట్‌లు నామినేషన్లు దాఖలు చేయగా, ఆయనకు డమ్మీ అభ్యర్థిగా సొంగా ఐజాక్‌రాజ్ నామినేషన్ దాఖలు చేశారు. పచ్చిగుళ్ళ జాన్ ధర్మరాజు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. నూజివీడు కూటమి అభ్యర్థిగా కొలుసు పార్థసారథి, ఇండిపెండెంట్ అభ్యర్థిగా బొట్ల శివసత్యనారాయణ రెండు సెట్లు, కైకలూరు వైసీపీ అభ్యర్థిగా దూలం నాగేశ్వరరావు రెండు సెట్లు, ఆయన భార్య దూలం వీరకుమారి రెండు సెట్లు, బీఎస్పీ తరఫున మన్నేపల్లి నాగేశ్వరరావు, జైభీమ్‌రావ్ భారత్ పార్టీ తరఫున గొంతు పులుగు సతీష్‌కుమార్, ఇండిపెండెంట్‌గా కోటి శ్రీనివాసరావులు నామినేషన్లు దాఖలుచేశారు. ఉంగుటూరు నుంచి కాంగ్రెస్ (ఐ) తరఫున పాతపాటి హరికుమార్‌రాజు, పిరమిడ్ పార్టీ తరఫున పెరుమాళ్ల మురళీకృష్ణ తమ నామినేషన్లను ఆర్వో ఖాజావలి వద్ద దాఖలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఉండి ఎమ్మెల్యేగా 50 వేల మెజారిటీతో గెలిచి చంద్రబాబుకు గిఫ్ట్‌గా ఇవ్వనున్నట్టు టీడీపీ అభ్యర్థి కనుమూరు రఘురామకృష్ణరాజు ధీమా వ్యక్తం చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యే మంతెన రామరాజు, ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస వర్మతో ర్యాలీగా ఉండి ఆర్వో కార్యాలయానికి వచ్చి నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా గెలుపుపై ధీమా వ్యక్తం చేశారు.


ఆర్వోకు నామినేషన్ పత్రాలను అందిస్తున్న దెందులూరు టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్

నేతలకు సోకు.. జనాలకు షాక్!



- నామినేట్ అయ్యి ఏం ఒరగబెట్టారు..
- జిల్లాకు అదనంగా వచ్చిపడిందేంటి..?
- సామాజిక వర్గాల పేరిట మాయ మాటలు .. సుష్క వాగ్దానాలు..
- ఐదేళ్ల పాలనలో మిగిలిందంతా జీరోనే..
- ఎన్నికల వేళ మళ్లీ ఇవే తాయిలాలు

అంతన్నారు.. ఇంతన్నారు. తాము తప్ప మరే రాజకీయ పార్టీ సేవ చేయలేదన్నారు. కులాల సంక్షేమం అంటే తమకు ఎంతో ఇష్టమన్నారు. అధికార పగ్గాలు చేపట్టిన వెంటనే వైసీపీ ప్రభుత్వం తమ నేతలందరికీ పదవులు పందారం చేసింది. అధికార దర్పం ప్రదర్శించేలా అన్ని హంగులు కల్పించింది. నెలవారీ గౌరవ వేతనాలు ఇచ్చి సగం సదుపాయాలు కల్పించి ఇదిగో మీ సామాజిక వర్గానికి ఒక కార్పొరేషన్.. కొద్ది నెలల్లోనే మీ సామాజిక వర్గంలో వెలుగులు నింపుతామంటూ గొప్పలు పలికింది. కాని చెప్పింది ఒకటి చేసింది ఇంకోటి.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

వైసీపీ అధికారంలోకి రాగానే ఎవరెవరికి ఏఏ పదవులు ఇచ్చి అధికార పగ్గాలు చేతికి అందించాలని ముందుగానే వ్యూహం పన్ని సరిగ్గా అదే చేసింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఆయా సామాజిక వర్గాల కార్పొరేషన్‌లకు రాష్ట్రస్థాయి చైర్మన్‌లను నియమించింది. మరికొందరిని జిల్లా స్థాయిలో నామినేట్ చేసింది. తమ జెండా మోస్తూ వారి రుణం తీర్చుకునేందుకు నామినేట్ పదవులు ఇచ్చింది. కాని ఐదేళ్లుగా ఒక్కటంటే ఒక్క పని గాని, తమకంటూ వ్యక్తిగత ముద్ర గాని కార్పొరేషన్‌పరంగా ఒక గుర్తింపు గాని తేలేకపోయారు. కొల్లేరు పరిధిలోనే వేలాది మందికి చెందిన ఓ సామాజిక వర్గం వారే ఉన్నారు. వీరి కోసం ప్రత్యేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు మచ్చుకైనా చేయలేదు. ఈ సామాజిక వర్గానికి అదనంగా పట్టెడన్నం, చేతి నిండా పని కల్పించడానికి ఒక్క ప్రయత్నమూ లేదు. మరేం చేశారంటే ఆ సామాజికవర్గ అభివృద్ధి కోసమంటూ ఒక కార్పొరేషన్ పెట్టి సొంత పార్టీకి చెందిన వ్యక్తిని నియమించి ఇంకేముంది సంక్షేమం మీ వైపే అంటూ ఊదరగొట్టారు. అంతేతప్ప ప్రత్యేకంగా ఈ ఐదేళ్లలో చేసిదేమీ లేదు. సూర్యబలిజ, అతిరస, వడ్డీలు సామాజిక వర్గానికి చెందిన మరెవరిని ఒక్కరంటే ఒక్కరిని పైకి తీసుకురాలేకపోయారు. కేవలం పార్టీ పరంగానే నేతలకు మాత్రం సోకు ఇచ్చి ఏమి చేయలేక జనానికి షాక్ ఇచ్చారు. ఏలూరు అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ కింద నానా హంగామా చేశారు. ఒకరు కాదు.. ఇద్దరు కాదు ఈ ఐదేళ్లలో ముగ్గురిని చైర్మన్‌గా నామినేట్ చేశారు. ఈ అథారిటీ పరిధిలో ఏం చేశారని చూస్తే ఫ్లయ్‌వోవర్‌లు మీద అక్కడక్కడ చిన్న చిన్న మొక్కలు నాటడం, సిమెంటు కుండీలు తప్ప మరేది సాధ్యం కాలేదు. ఐసీడీఎస్ రీజనల్ చైర్మన్ ఇచ్చి సరిపెట్టారు.

ఎన్నికల లబ్ధి కోసం కార్పొరేషన్ల ఏర్పాట్లు, చైర్మన్‌లు, డైరెక్టర్‌లు నియామకమే తప్ప వెనక్కి తిరిగి చూస్తే ఆయా సామాజిక వర్గాల్లో ఏమాత్రం వెలుగులు నింపలేదు. అంతకంటే మించి లొసుగులే మిగిల్చారు. ఆయా సామాజిక వర్గాల్లో ఇప్పుడు కొంత చైతన్యం వచ్చి చెప్పేది ఒకటి.. చేసేది ఒకటా అంటూ అసంతృప్తితో ఉన్నారు. రుణ సదుపాయం, ఉపాధి కల్పన, మరికొంత వ్యాపా రం, చేతినిండా పని కల్పించలేని కార్పొరేషన్లు కేవలం నేతల కోసమేనా. మరి దిగువున్న జనం కోసం ఏం చేశారనే ప్రశ్నలు తాజాగా సంధిస్తున్నారు. సమాధానం చెప్పేందుకు ఏ ఒక్కరూ సిద్ధంగా లేనేలేరు. మళ్లీ ఎన్నికలు రావడంతో పాత పాట అందుకుంటున్నారు. స్థానిక నేతలు ఈసారి అధికారంలోకి వస్తే పలానా కార్పొరేషన్‌లో మీకే పదవులు అంటూ తాయిలాలు విసురుగుతున్నారు. చైర్మన్ పదవి లాక్కుంటే డైరెక్టర్ అయినా అయ్యేలా చూస్తామంటూ హామీ ఇస్తున్నారు. కాని ఆయా సామాజిక వర్గాల్లో రగులుతున్న అసం తృప్తి మండుటెండలకు మించే ఉంది. సమయం కోసం, మార్పు కోసం ఎదురు చూసే దిశగా అడుగులు వేస్తున్నట్టు ఆయా సామాజిక వర్గాల్లో ప్రజలు విశ్లేషిస్తు న్నారు.


పూడిపోయిన గోస్తని నది

జగన్మాయ

హామీ ఇచ్చేస్తే పోలా.. అమలు చేస్తామా.. ఏంటి..!? అధికార పార్టీ నేతల తీరు అచ్చంగా ఇలాగే ఉంది. అధికారం కోసం నోటికొచ్చిన హామీ ఇచ్చేశారు.. ఐదేళ్లలో వాటిని పట్టించుకున్న పాపాన పోలేదు. గోదావరిపై అయోధ్యలంక, పుచ్చల్లంక మధ్య హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి జగన్ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక బ్రిడ్జి హామీ గోదాట్లో పడేశారు. నియోజకవర్గ ప్రజలకు పైపులైన్ల ద్వారా గోదావరి జలాలను తాగునీరుగా అందిస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ గోదాట్లో కలిపేశారు. ఆచంటలో 100 పడకల ఆస్పత్రి హామీకి సుస్తీ చేసింది. పెనుగొండ మండలం సిద్ధాంతంలో రూ. 5 కోట్లతో శ్మశానం అభివృద్ధి హామీని సమాధి చేశారు. పెనుమంట్ర మండలం ఎస్.ఇల్లిందరపర్రులో రూ. 8.12 కోట్ల లాకుల అభివృద్ధి హామీ కాల్వలో కొట్టుకుపోయింది..

- ఆచంట, పెనుమంట్ర, పెనుగొండ

హామీలే..

అమలు చేస్తామా.. ఏంటి..!?

ఆచంట నియోజకవర్గం అభివృద్ధికి దూరం

తాగునీటికి గోదావరి జలాలు ఇవ్వలేదు.. గోదాట్లో హైలెవెల్ బ్రిడ్జి


నిలిచిపోయిన లాకుల అభివృద్ధి పనులు



నెరవేరని సీఎం హామీ

ఎన్నికల ప్రచారంలో భాగంగా జగన్ పెనుగొండలోజరిగిన సభలో అయోధ్యలంక, పుచ్చల్లంక బ్రిడ్జిని అధికారంలోకి వచ్చిన వెంటనే నిర్మిస్తామని చెప్పారు. ప్రస్తుతం దాని ప్రస్తావనే లేదు.

గత ఎన్నికల్లో చెరుకువాడ రంగనాథరాజు అనేక హామీలు గుప్పించారు.

- అధికారంలోకివస్తే గోదావరి జలాలను అక్కడే శుద్ధిచేసి పైపులైన్ ద్వారా గ్రామాలకు అందించడం వైసీపీ లక్ష్యం అంటూ ప్రచారం చేశారు. ఐదేళ్లుగా గ్రామాలకు గోదావరి జలాల జాడలేదు.
- బ్రిటిష్ కాలంలో గోస్తనీ నదిపై నిర్మించిన వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మిస్తానన్నారు. కొత్త వంతెన నిర్మాణం లేదు సరికదా శిథిలావస్థలో ఉన్న వంతెనకు కనీసం మరమ్మతులు లేవు.
- పెనుమంట్ర మండలంలో ప్రధాన మురుగు కాల్వ గోస్తనీ నది తూడుతో పూడికపోవటంతో 6వేల ఎకరాల పంట ఏటా వర్షాలకు నీట మునుగుతోంది. పట్టించుకున్న దాఖలాలు లేవు.
- ఆచంటలో 30 పడకల ఆసుపత్రిని వంద పడకలుగా అభివృద్ధి చేస్తామన్న హామీ మరిచిపోయారు.
- ఆచంటలో దశాబ్దాల తరబడి ఎన్నికల హామీగానే మిగిలిన అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇటీవల స్థలం సేకరించి పంచాయతీ తీర్మానం చేసినా నిర్మాణం చేపట్టలేదు.
- ఆచంటకు ప్రధాన సమస్య మురుగు డ్రెయిన్ లేకుండా చేస్తానని హామీ ఇచ్చినప్పటికి ఐదేళ్లు విస్మరించారు.
- పెనుగొండ మండలం సిద్ధాంతం శ్మశాన వాటిక అభివృద్ధికి రూ.5 కోట్లుతో పనులు చేపడతామని హామీ ఇచ్చారు. కనీసం ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు.
- పెనుగొండ సంత మార్కెట్ అభివృద్ధి, పెనుగొండ ట్రంకుపెట్టెల పరిశ్రమకు గుర్తింపు తెస్తానన్న హామీలు గుర్తున్నాయో లేదో..?

ఆచంట మండలంలో పలు అభివృద్ధి పనులకు చెరుకువాడ శ్రీరంగనాథరాజు హామీలు ఇచ్చారు. ఐదేళ్లుగా వాటిని పట్టించుకోలేదు. గోదావరి నదిపై హైలెవెల్ బ్రిడ్జి, వంద పడకల ఆస్పత్రి, అగ్నిమాపక కేంద్రం, డ్రెయినేజీ, కాపు, బీసీ ఎస్సీ కమ్యూనిటీ భవనాలు, ఆచంటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామన్న హామీలు అమలుకు నోచుకోలేదు. సిద్ధాంతం ఇసుక బంటా కార్మికులు పనుల్లేక పస్తులుంటున్నారు. పెనుగొండ సంత మార్కెట్ అభివృద్ధి, ట్రంకుపెట్టెల పరిశ్రమకు గుర్తింపు హామీలు పట్టించుకున్న దాఖలాలు లేవు. పెనుమంట్ర మండలంలో నాలుగు గ్రామాలకు సాగునీరు, తాగునీరు అందించేలా బ్రిటిష్ హయంలో ఏర్పాటు చేసిన ఎస్ ఇల్లింద్రపర్రు లాకులు పునర్నిర్మాణంపై హామీలతో రైతులను నమ్మించి ఐదేళ్లుగా ఐదు పైసలు ఖర్చు చేయలేదు. 2018లో లాకుల అభివృద్ధికి రూ. 8.12 కోట్లతో పనులు శంకుస్థాపన చేశారు. నిర్మాణం పనులు కొంత వరకు జరిగినప్పటికీ ఎన్నికలు రావడంతో నిలచిపోయాయి. శ్రీరంగనాథరాజు ఎమ్మెల్యేగా లాకు అభివృద్ధి పనులు పూర్తిచేస్తానని హామి ఇచ్చినా అది హామిగానే మిగిలిపోయింది. దీంతో రైతులు నిరాశకు గురి అవుతున్నారు.

నత్తారామేశ్వరం- వేల్పూరు రహదారి, మార్టేరు - వనంపల్లి రహదారి పట్టించుకోలేదు. ఇరగవరం-అత్తిలి రోడ్డు అభివృద్ధి ఆగిపోయింది. పెనుమంట్ర మండలంలో ప్రధాన మురుగు కాల్వ గోస్తనీ నది పూడికపోవటంతో 6వేల ఎకరాల రైతులకు ఏటా నష్టం తప్పడం లేదు. పూడిక తీత, గట్టు అభివృద్ధి హామీలు తూతూమంత్రంగా చేపట్టారు. తూడు తొలగింపు పనులు అధికార పార్టీ నేతలు సబ్ లీజుకు తీసుకుని పనులు పూర్తిస్థాయిలో చేపట్టకపోగా జేబులు నింపుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పెనుమంట్ర మండలంలో గత తెలుగుదేశంహయంలో చేపట్టిన అభివృద్ధిపనులను నేటి పాలకులు పట్టించుకోకపోవడంతో దాదాపు రూ.20 కోట్ల అభివృద్ధి పనులు నిలచిపోయాయి. రూ.90 లక్షలతో నిర్మాణం చేపట్టిన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణం పిల్లర్ దశలోనే ఆగిపోయింది. అదే ప్రాంగణంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణాలు కూడా నిలిచిపోయాయి.


నియోజకవర్గ కేంద్రం ఆచంటలో ప్రధాన సమస్య మురుగు


శిథిలావస్థలో పెనుమంట్ర మండలం మాముదూరు వంతెన


టీడీపీ ప్రభుత్వ హయాంలో అయోధ్యలంక బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన శిలాఫలకం



మూడు వేల ఆయకట్టుకు ముంపు ముప్పు

ఎస్.ఇల్లింద్రపర్రు లాకు ఎగువన ఉన్న నాలుగు గ్రామాలకు 3వేల ఆయకట్టుకు సాగునీరు, తాగునీరు అందిస్తుంది. లాకు శిథిలావస్థకు చేరడంతో పంటలకు ముంపు ముప్పు తప్పడం లేదు. కొత్త లాకుల నిర్మాణం జరుగుతుంది కదా ఎటువంటి ఇబ్బందులు ఉండవని భావించాం. కానీ ప్రస్తుత పాలకులు హామీ ఇచ్చారే తప్ప నిర్మాణం చేయలేకపోయారు. ఎప్పుడు ఉపద్రవం వస్తోందనని భయపడుతున్నాం.

- వనం శ్రీను, రైతు, ఎస్ ఇల్లింద్రపర్రు

నేటి పాలకులు వదిలేశారు

తెలుగుదేశం పాలనలో కొత్త లాకుల నిర్మాణ పనులు ప్రారంభించారు. 2019 ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారడంతో నిర్మాణ పనులు ఆగిపోయాయి. కొత్త ప్రభుత్వం లాకుల నిర్మాణం వైపు కన్నెత్తి చూడకపోవటంతో శిథిలావస్థకు చేరిన లాకులతో పాటు ప్రారంభించిన పనులు సైతం శిథిలావస్థకు చేరే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం రైతు సమస్యలను పట్టించుకోవడం లేదు. రైతులను నట్టేట ముంచేవిధంగా పాలన ఉంటే ఎలా?

పాలా దానయ్య, రైతు, ఎస్.ఇల్లింద్రపర్రు



హై..హై నాయకా..

అధికార పార్టీ హడావుడి

తాడేపల్లిగూడెం పట్టణంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఒకరు వైసీపీలో చేరారు. తెలుగుదేశం కూటమికి పెద్ద దెబ్బ అంటూ అధికార పార్టీ హడావుడి అంతా ఇంతా కాదు. వాస్తవానికి వైసీపీలో చేరిన నాయకుడు 2014లో అదే పార్టీలో ఉన్నారు. వైసీపీ అభ్యర్థికి అప్పట్లో ప్రచారం చేశారు. ఆ ఎన్ని కల్లో వైసీపీ ఓటమి పాలైంది. తెలుగుదేశం కూటమి అభ్యర్థిగా బీజేపీ తరపున పైడికొండల మాణిక్యాలరావు గెలుపొందారు. మంత్రి అయ్యారు. దాంతో సదరు వైస్ చైర్మన్ బీజేపీలో చేరారు. ఐదేళ్లపాటు పైడికొండల మాణిక్యాల రావుతో నడిచారు. 2019 ఎన్నికల ముందు మాణిక్యాలరావును వదిలి తెలుగుదేశంలో చేరారు. గడచిన ఎన్నికల్లో తెలుగుదేశం ఓటమి చవిచూడడంతో అప్పటినుంచి పార్టీకి దూరంగా ఉన్నారు. ఏ రోజూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన లేదు. రాజకీయాలకు దూరంగా ఉన్నారు. తాజాగా వైసీపీలో చేరడంతో అధికార పార్టీ నాయకులు సంబర పడిపోతున్నారు. కూటమికి పెద్ద దెబ్బేనని సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారు.

- తాడేపల్లిగూడెం అర్బన్


ముఖ్యమంత్రిగా చింతలపూడి పర్యటనలో ఎన్‌టీ రామారావు

ప్రముఖ నేతల చింతలపూడి టూర్

చింతలపూడి నియోజకవర్గం 1952లో ఏర్పడింది. అప్పటి నుంచి నియోజకవర్గంలో ఎందరో ముఖ్యమంత్రులు, ప్రముఖులు అధికార హోదా, ప్రతిపక్ష హోదాలో పర్యటించారు. కానీ గడచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో ముఖ్యమంత్రి జగన్ ఒక్కసారి కూడా నియోజకవర్గంలో పర్యటించలేదు.

- 1967లో అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా పర్యటించారు.
- 1976లో సీఎం జలగం వెంగళరావు తమ్మిలేరు రిజర్వాయర్ నిర్మాణ పనులు పర్యవేక్షణకు, 84లో పీసీసీ అధ్యక్షుడి హోదాలో మరోసారి పర్యటించారు.
- 1979లో ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి, చింతలపూడి ఉన్నత పాఠశాల, హాస్టల్ భవన నిర్మాణాలకు శంకుస్థాపన నిమిత్తం ముఖ్యమంత్రి హోదాలో వచ్చారు.
- 1982లో ఏఐసీసీ అధ్యక్షుడు రాజీవ్‌గాంధీ రాష్ట్ర పర్యటనలో భాగంగా చింతలపూడి సుప్రియన్‌పేటలో పర్యటించి బహిరంగ సభలో మాట్లాడారు.
- 1983లో ఎన్టీఆర్ ప్రచార యాత్రకు వచ్చారు. ఆయనను చూడడానికి ప్రజలు పలు గ్రామాల నుంచి వచ్చి మూడు రోజులు రోడ్లపైనే వంటలు చేసుకుని వండుకుని నిద్రించి ఎన్‌టీఆర్‌ని చూసి తరించారు. ఆయన ముఖ్యమంత్రి అయిన తరువాత 1987 సెప్టెంబర్‌లో చింతలపూడి దుర్భిక్ష ప్రాంతంలో పర్యటించి ఒకరోజు రాత్రి ఇక్కడే ఉన్నారు. మరోసారి వివేకానందుని గెటప్‌లో నియోజకవర్గంలోని కామవరపుకోట బహిరంగ సభలో మాట్లాడారు.
- టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు సీఎం హోదాలో మూడుసార్లు, ప్రతిపక్ష నాయకుడి హోదాలో ఐదుసార్లు నియోజకవర్గంలో పర్యటించారు. 1992లో నామవరంలో ఉమ్మడి అటవీ యాజమాన్య పథకాన్ని ప్రారంభించారు. 2003లో తూర్పు యడవల్లి రామాలయం సందర్శించారు. 2006లో తమ్మిలేరు వరదకు శివపురం నీటమునిగింది. బాధితులను, గ్రామస్థులను పరామర్శించారు. 2008లో మీకోసం వస్తున్న పాదయాత్రలో చింతలపూడి రోడ్‌షోలో పాల్గొని ఇక్కడి నుంచి తెలంగాణ సరిహద్దులోకి వెళ్ళారు. 2018లో ముఖ్యమంత్రి హోదాలో చింతలపూడి బోయగూడెం సభలో మాట్లాడారు. 2022లో ప్రతిపక్ష నాయకుడి హోదాలో జంగారెడ్డిగూడెంలో సారా మృతుల కుటుంబాన్ని పరామర్శించారు. 2023లో ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని మొదటి బహిరంగ సభ ఇక్కడి నుంచే ప్రారంభించారు. 2024లో రా కదిలిరా బహిరంగ సభలో కూడా పాల్గొన్నారు.
- వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నియోజకవర్గంలో నాలుగు సార్లు పర్యటించారు. ఒకటి రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణకు, రెండోసారి పీసీసీ అధ్యక్షుని హోదాలోనూ, మూడోసారి 2003లో ప్రజాప్రస్థానం పాదయాత్రలో జిల్లాలో పర్యటనలో భాగంగా చింతలపూడి నియోజకవర్గంలోని మూడురోజులు పాదయాత్ర జరిపారు. ముఖ్యమంత్రి హోదాలో ఒకసారి వైఎస్ పర్యటించారు.
- 2012లో నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా రాష్ట్రంలో రచ్చబండ కార్యక్రమాన్ని చింతలపూడి నుంచే ప్రారంభించారు.
- వైఎస్ జగన్ ప్రతిపక్ష హోదాలో 2018లో పాదయాత్ర చేశారు. తరువాత ఐదేళ్ల పాలనలో ఒక్కసారి కూడా పర్యటించలేదు.

- చింతలపూడి

బీ కేర్ ఫుల్



కాకి లెక్కలు

విజయంపై అభ్యర్థి ధీమా

• వారించిన అధినేత • కష్టపడాలని దిశానిర్దేశం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వ తీరుపై ప్రజల్లో వ్యతిరేకత ఉంది. అధికార పార్టీ నాయకులపై అవినీతి మచ్చ ఉంది. ఇంకేముంది తమ గెలుపు నల్లేరు నడకే అని తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు భావిస్తున్నారా..? ఆ ధీమా ఉంటే ఎన్నికల్లో బోల్తా పడతామని కూటమి శ్రేణులు చర్చించుకుంటున్నాయి. తీర ప్రాంతంలో ఒక నియోజకవర్గ అభ్యర్థి అక్కడ నెలకొన్న సామాజిక సమీకరణలు బేరీజు వేసుకుంటున్నారు. గెలిచేస్తామని విశ్వాసంతో ఉన్నారు. గడచిన ఎన్నికల్లో తక్కువ ఓట్ల తేడాతో పరాజయం పొందామని, ఇప్పుడు తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమితో విజయం సాధిస్తామని నమ్మకంగా ఉన్నారు. అన్ని పార్టీలు ఓట్ల గణాంకాలను బేరీజు వేసుకుంటే గెలుపు సునాయాసమేని భావిస్తున్నారు. కానీ ఎన్నికల్లో నాయకులందరినీ కలుపుకొని వెళ్లాలి. ఇదే విషయాన్ని పాలకొల్లులో నిర్వహించిన కూటమి అభ్యర్థుల సమీక్షలో ప్రత్యేకంగా చంద్రబాబు నొక్కి చెప్పారు. గెలుపు ధీమా వద్దంటూ కర్తవ్య బోధ చేశారు. సదరు నియోజకవర్గ ముఖ్య నాయకులను ఎన్నికలకు సమాయత్తం చేయడంలో చంద్రబాబు చొరవ చూపారు. ఇప్పుడు నాయకులంతా ప్రచారంలో దూకారు. నాయకులతోపాటు, కేడర్‌ను కూడా కలుపుకొని వెళుతున్నారు. వ్యయప్రయాసలకోర్చి ముందుకు సాగాలి. అధికార పార్టీ డబ్బుతోనే ఎన్నికలను నిర్వహించేద్దామన్న ప్రణాళికలు రచిస్తోంది. కూటమి అభ్యర్థికి అండగా ఉన్న రెండు బలమైన సామాజిక వర్గాల ఓటర్లను డబ్బుతో తమవైపు తిప్పుకోవాలని లెక్కలు వేసుకుంటున్నారు. కులాల చిచ్చు పెడుతున్నారు. వీటన్నింటినీ అంచనా వేసుకుని కూటమి ఓటు బ్యాంకును కాపాడుకోవాలి. ఆ దిశగా నాయకులను, కార్యకర్తలను సంసిద్ధం చేయాలి. అప్పుడే విజయం సాధ్యమని కూటమి శ్రేణుల్లో చర్చ సాగుతోంది.

అధికారం ఆమెదే

జిల్లా నుంచి ఎమ్మెల్యే, ఎంపీలైన మహిళలు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో మహిళల ఓట్లు, పదవులు కూడా పెరుగుతూ వచ్చాయి. 1955లో తొలిసారి అత్తిలి నుంచి అమ్మన్న రాజా గెలుపొందారు. 1983లో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ స్థాపించిన తర్వాత మహిళల ప్రాతినిధ్యం మరింత పెరిగింది.

- 1970 ఉప ఎన్నికల్లో ఉండి అసెంబ్లీ స్థానంలో స్వతంత్ర అభ్యర్థిగా కె. అండాలమ్మ ఎమ్మెల్యేగా గెలిచారు.
- 1978లో గోపాలపురం అసెంబ్లీ నుంచి తొలిసారిగా దాసరి సరోజినీ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఇక్కడి నుంచి రెండోసారి మహిళ మద్దాల సునీత 2004లో ఎన్నికయ్యారు. 2009లో ఇదే స్థానంలో తానేటి వనిత టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.
- 1981లో నరసాపురం అసెంబ్లీలో తొలిసారి పరకాల కాళికాంబ కాంగ్రెస్ నుంచి ఎన్నికయ్యారు.
- 1983, 1987 ఎన్నికల్లో తాడేపల్లిగూడెం నుంచి ఈలి వరలక్ష్మి గెలిచారు.
- పెనుగొండ అసెంబ్లీ నుంచి1983, 1985లలో వరుసగా ప్రత్తి మణెమ్మ ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రి అయ్యారు.
- 1995లో దెందులూరు అసెంబ్లీ స్థానంలో మాగంటి వరలక్ష్మి కాంగ్రెస్ నుంచి గెలుపొంది మంత్రి పదవి దక్కించుకున్నారు.

- 1999లో ఆచంట నుంచి టీడీపీ తరఫున ఎన్నికల్లో పోటీ చేసిన గెలుపొందిన తొలి మహిళ మోచర్ల జోహార్వతి.
- 2004లో ఆచంట నుంచే పీతల సుజాత టీడీపీ తరఫున గెలుపొందిన రెండో మహిళ.
- 2009లో పాలకొల్లు నుంచి బంగారు ఉషారాణి కాంగ్రెస్ తరఫున గెలుపొందారు.
- 2014లో చింతలపూడి స్థానంలో పీతల సుజాత టీడీపీ తరఫున గెలిచిన తొలి మహిళా ఎమ్మెల్యే.
- 2019లో కొవ్వూరు అసెంబ్లీ స్థానం నుంచి వైసీపీ తరఫున గెలిచిన తానేటి వనిత గెలుపొంది మంత్రి అయ్యారు.



పార్లమెంట్ స్థానంలో..

జిల్లా నుంచి పార్లమెంట్ స్థానంలో మహిళలు ఎన్నికయ్యారు. 1952 లో సీపీఐ నుంచి అమన్నరాజా పోటీపడ్డారు. 1957లో సీపీఐ అభ్యర్థి విమలాదేవిపై కాంగ్రెస్ అభ్యర్థి వేదకుమారి విజయం సాధించారు. 1962లో మరోసారి వారిద్దరూ పోటీపడగా విమలాదేవి గెలుపొందారు. 2009లో నరసాపురం పార్లమెంట్ నుంచి టీడీపీ తరఫున తోట సీతారామలక్ష్మి పోటీ చేసి ఓటమి చెందారు. తరువాత రాజ్యసభకు వెళ్లారు.

స్థానిక సంస్థల్లో..

స్థానిక సంస్థల్లో కూడా మహిళలకు రిజర్వేషన్ అమలు కావడంతో టీడీపీ హయాంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా తొలిసారి ఇమ్మణ్ణి రాజేశ్వరి ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఘంటా పద్మశ్రీ జడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్నారు. శాసన మండలి సభ్యురాలిగా గంగాభవాని ఈ జిల్లా నుంచి అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. జడ్పీటీసీ, మండల పరిషత్ అధ్యక్షులు, సర్పంచ్‌లుగా పలువురు మహిళలు పాలనలో సత్తా చాటుతున్నారు.

- భీమవరం టౌన్

పోస్టల్ బ్యాలెట్ వినియోగం ఇలా..



సాధారణ ఎన్నికల విధుల్లో నియమితులైన అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా పార్లమెంట్, అసెంబ్లీ ఓటు వేస్తారు. వారు ఫారం-12 వినియోగించుకునేందుకు పాటించాల్సిన విధివిధానాలపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారని ఏపీ ఎన్జీవోల సంఘం రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ ఆర్.ఎస్.హరనాథ్ తెలిపారు. సంబంధిత రిటర్నింగ్ అధికారికి కాపీ ఆఫ్ ఎలక్షన్ డ్యూటీ ఆర్డర్, ఎన్నికల ఐడీ కార్డు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టుసైజు ఫోటోలను జతచేసి ఈ నెల 26లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రిటర్నింగ్ అధికారి జారీచేసే రెండు పోస్టల్ బ్యాలెట్‌లను వినియోగించుకుని మే 8లోగా సంబంధిత రిటర్నింగ్ అధికారి ఏర్పాటు చేయించిన డబ్బాలో వాటిని వేయాలి. బాధ్యతగల పౌరులుగా ఓటుహక్కు వినియోగించుకోవాలని కోరారు.

- ఏలూరు అర్బన్

రూ.2.75 లక్షలతో ఎమ్మెల్యేనయ్యా

కొండ్రెడ్డి విశ్వనాథం
మాజీ ఎమ్మెల్యే



ఎన్నికల్లో పోటీపడుతున్న అభ్యర్థుల ఖర్చు తడిసిమోపెడవుతోంది. 1994 ఎన్నికల్లో తాను రూ. 2.75 లక్షల ఖర్చుతో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని మాజీ ఎమ్మెల్యే కొండ్రెడ్డి విశ్వనాథం చెప్పారు. అప్పట్లో టీఎన్.శేషన్ ఎన్నికల ప్రధానాధికారి. నిబంధనల అమలులో ఆయన కఠినంగా వ్యవహరించారు. రాజకీయ పార్టీలు బెంబెలెత్తి పోయాయి. నిబంధనల అమలులో కచ్చితంగా వ్యవహరించడమే కాకుండా మద్య నిషేధం, నగదు పంపిణీపై ఉక్కుపాదం మోపారు. ఇదే అంశం పలువురు అభ్యర్థులకు కలిసి వచ్చింది. కొందరు అభ్యర్థులు నానా తంటాలు పడ్డారు. దీంతో ఎన్నికల ప్రచారం చప్పగా సాగింది. ఆ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేసి తాను కేవలం రూ.2.75 లక్షలతో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని గుర్తు చేసుకున్నారు. ఉంగుటూరు, కైకరం గ్రామాలలో ఎన్నికల ప్రచారం చేయాలని ప్రయత్నించినా ఆలయ ప్రాంగణాలలో ఎన్నికల ప్రచారం చేయడానికి వీలు లేకుండా పోయిందన్నారు. రిక్షాలు, ఆటోలతోనే ఎన్నికల ప్రచారం చేయవలసి రావడం, వాల్‌పోస్టర్లకు కూడా అనుమతి తీసుకోవలసి ఉండడంతో నానా అవస్థలు పడ్డామన్నారు. ఎన్నికల నిబంధనల పుణ్యమా అని సాధారణ వ్యక్తినైన తాను ఎమ్మెల్యేగా ఎన్నిక కావడం విశేషమని విశ్వనాథం గుర్తు చేసుకున్నారు.

- ఉంగుటూరు

జడ్పీటీసీ ఓటమి.. మంత్రి పదవికి ఎసరు



మంత్రి ఇలాకాలో మండల జడ్పీటీసీ సభ్యుడి ఉప ఎన్నికలో అధికార పార్టీ ఓటమి మంత్రిగారి పదవికి ఎసరు పెట్టింది. మంత్రిగా ఉన్న నియోజకవర్గంలో జడ్పీటీసీని గెలిపించుకోలేకపోవడంతో సీఎం వ్యాఖ్యలతో ఆ మంత్రి పదవికి రాజీనామా చేశారు. 2004 సార్వత్రిక ఎన్నికల్లో దెందులూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన మాగంటి వెంకటేశ్వరరావు (బాబు)ను రెండేళ్ల తర్వాత చిన్న నీటి పారుదల శాఖ మంత్రి పదవి వరించింది. ఏడాది తరువాత దెందులూరు మండల జడ్పీటీసీ పదవికి ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఓటమి పాలవడంతో మంత్రి మాగంటి బాబు తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. 2009లో మాగంటి బాబు టీడీపీ తరఫున ఎంపీగా పోటీచేసి ఓటమి పాలయ్యారు. 2014లో టీడీపీ నుంచి ఎంపీగా గెలిచారు. 2019లో ఎంపీగా ఓటమి చెందారు.

- పెదవేగి

పవన్ కల్యాణ్ సభలో బ్లేడు కలకలం

భీమవరం క్రైం, ఏప్రిల్ 22 : భీమవరం ప్రకాశం చౌక్‌లో ఈనెల 21వ తేదీన జరిగిన పవన్ కల్యాణ్ బహిరంగ సభలో ఇద్దరు యువకులు బ్లేడులతో సభలోకి వచ్చారని సమాచారం రావడంతో పోలీసులు వారిద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారిని తనిఖీ చెయ్యగా ఎటువంటి బ్లేడులు, ఆయుధాలు లేవని తెలియడంతో పోలీసులు వారిని విడిచిపెట్టారు. అయితే పట్టుబడినవారు వైసీపీ సానుభూతిపరులని తెలుస్తున్నది. దీనిపై వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీనును వివరణ కోరగా ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని వారి వద్ద బ్లేడులు, ఆయుధాలు లేవని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యయ పరిశీలకురాలు నీనా నిగమ్

ఎన్నికల ఖర్చుపై నిఘా పెట్టాలి

భీమవరం టౌన్, ఏప్రిల్ 22 : ఎన్నికల ప్రచారంలో అభ్యర్థుల ఖర్చులపై నిరంతర నిఘా ఉంచాలని రాష్ట్ర ప్రత్యేక ఎన్నికల వ్యయ పరిశీలకురాలు, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి నీనా నిగమ్ ఆయా నోడల్ ఏజెన్సీ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. నామినేషన్లు ప్రారంభమైన దృష్ట్యా తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. స్వేచ్ఛగా నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకునేలా ఎన్నికలను నిర్వహించాలన్నారు. ఖర్చులను అభ్యర్థుల ఖాతా లకి చూపడంలో ఎన్నికల సిబ్బంది నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. ప్రచార ఖర్చులు, బహుమతుల పంపిణీ, ఇతర ఖర్చులపై దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వ్యయ పర్యవేక్షణ బృందాల పనితీరు గురించి వివరించారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు, జిల్లా ఎన్నికల నియంత్రణ కేంద్రం (కంట్రోల్ రూమ్), రాజకీయ ప్రచారానికి సంబంధించిన అనుమతుల గురించి వివ రించారు. జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల భద్రతా ఏర్పాట్లను వివరించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను, ఎంసీఎంసీ సెంటర్‌ను నీనా నిగమ్ జిల్లా కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ కె.సంగీత్ మాదూర్, ఎన్నికల సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.



ఎస్‌ఈబీ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్‌ఈబీ కమిషనర్ ఎం.రవిప్రకాష్

సరిహద్దుల్లో పటిష్ట నిఘా

ఏలూరు క్రైం, ఏప్రిల్ 22 : సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, జిల్లాలో గంజాయి, మద్యం, అక్రమ రవాణా జరుగకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నామని ఎస్‌ఈబీ జిల్లా అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు తెలిపారు.స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రాష్ట్ర కమిషనర్ ఎం.రవిప్రకాష్ జిల్లా ఎస్ఈబీ అధికారులతో సోమవారం ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకూ తనిఖీల్లో సీజ్ చేయబడిన, నగదు మద్యం వివరాలను వెల్లడించారు. విజిలెన్స్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రామకృష్ణ, ఎస్ఈబీ అధికారులు పాల్గొన్నారు.



టీడీపీ కంచుకోట



8 ఎన్నికలలో ఏడుసార్లు టీడీపీదే విజయం..ఒకే ఒక్కసారి కాంగ్రెస్

డెల్టా, తీర ప్రాంతాల మేలు కలయికగా ఉన్న ఉండి నియోజకవర్గం చారిత్రక ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రపంచంలో అతిపెద్ద మంచినీటి సరస్సులో ఒకటిగా ఉన్న కొల్లేరు సరస్సు ఒక వైపు, మరోవైపు ఉప్పుటేరు, ప్రధాన మేజర్ కాలువల ద్వారా జలసిరులతో బంగారు పంటలు పండుతుండటంతో పాటుగా, ఆక్వా పరిశ్రమ వృద్ధి చెందుతోంది. ఈ నియోజక వర్గంలో ఉద్దండులైన నేతలెందరినో చట్టసభలకు పంపిన చరిత్ర ఉంది. తెలుగుదేశం ఆవిర్భావం తరువాత జరిగిన 8 ఎన్నికలలో ఏడుసార్లు టీడీపీ విజయం సాధించి రాష్ట్రంలో రెండవ కుప్పంగా పేరొందింది. 2009 వరకూ ఉండి నియోజకవర్గంలో కాళ్ళ, ఉండి, ఆకివీడు మండలాలు మాత్రమే ఉండేవి. 2009లో పునర్విభజన జరగడంతో పాలకోడేరు మండలం చేరింది.

- ఆకివీడు

ఉండి నియోజకవర్గం పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోకి వస్తుంది. నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గంలో ఉంది. 2024 ఓటర్ల జాబితా ప్రకారం ఉండి నియోజక వర్గంలో 2,22,999 ఓటర్లు ఉండగా పురుషులు 1,09,414, మహిళలు 1,13,583 మంది ఉండగా ఇతరులు ఇద్దరు ఉన్నారు. మొత్తంమీద ఈ నియోజకవర్గంలో మహిళలదే పైచేయిగా ఉంది.

ఉండిఅసెంబ్లీ నియోజకవర్గంలోని ఉండి, ఆకివీడు, కాళ్ళ, పాలకోడేరు మండ లాలలో ఉన్న 70 గ్రామాలలోని 238 పోలింగ్ కేంద్రాలలో 2,22,999 మంది ఓటర్లు ఉన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం అయిన తరువాత 1983 నుంచి 2004 వరకు వరుసగా ఐదు పర్యాయాలు మాజీ మంత్రి కలిదిండి రామచంద్రరాజు (అబ్బాయి రాజు) టీడీపీ తరుపున గెలిచారు. 2004 లో కాంగ్రెస్ అభ్యర్థి పాతపాటి సర్రాజు గెలిచారు. 2009, 2014లో వరుసగా రెండుసార్లు వేటుకూరి వెంకట శివరామరాజు (కలవపూడి శివ) టీడీపీ తరుపున గెలుపొందారు. 2019లో అనూహ్యంగా శివరామ రాజు నర్సాపురం ఎంపీ టీడీపీ అభ్యర్థిగా వెళ్ళడంతో మంతెన రామరాజు ఉండిలో పోటీ చేసి గెలుపొందారు. నియోజకవర్గంలో వెనుకబడిన తరగతులు వారు అత్యధికంగా ఉన్నారు. తరువాత కాపు సామాజికవర్గం, క్షత్రియులు ఉండగా, ఎస్సీ, మైనార్టీలు, ఎస్టీలు తదుపరి స్థానాల్లో ఉన్నారు. తెలుగుదేశానికి కంచుకోటగా ఉన్న ఉండి నియోజకవర్గంలో ఈసారి పాగా వేయడానికి వైసీపీ గట్టి ప్రయత్నాలు చేస్తున్నది.





టీడీపీ ఆవిర్భావం నుంచి ఉండి నియోజకవర్గం ఆ పార్టీకి కంచుకోటగా ఉంది. 1983లో టీడీపీ ఆవిర్భవించిన తొలిసారే కలిదిండి రామచంద్రరాజు 33,431 ఓట్లు ఆధిక్యంతో కాంగ్రెస్ అభ్యర్థి జి.రామచంద్రరాజుపై ఘన విజయం సాధించారు. ఆ తరువాత రెండేళ్లకే జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి డివి బాలసుబ్రహ్మణ్యం పై 29,133 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. 1983 నుంచి ఈ నియోజకవర్గంలో ఒకసారి మినహా 2019 వరకూ టీడీపీయే అధికారం చేపట్టింది. అయితే 2004లో కాంగ్రెస్ గెలిచింది. 1983 నుంచి 1999 వరకూ టీడీపీ నుంచి ఐదుసార్లు కె.రామచంద్రరాజు, 2004 కాంగ్రెస్ నుంచి పాతపాటి సర్రాజు, 2009, 2014లో టీడీపీ నుంచి వేటుకూరి వెంకట శివరామరాజు, 2019లో టీడీపీ నుంచి మంతెన రామ రాజు గెలుపొందారు. 1989లో కాంగ్రెస్ అభ్యర్థి దండుబోయిన పేరయ్యపై 5283 ఓట్లు, 1994లో కాంగ్రెస్-ఐ అభ్యర్థి కఠారి ప్రభాకరరావుపై 9208 ఓట్లు తేడాతో టీడీపీ అభ్యర్థి కె.రామచంద్రరాజు (అబ్బాయిరాజు) గెలుపొందారు.

సంవత్సరం	విజేత	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	మెజారిటీ
1983	కలిదిండి రామచంద్రరాజు	టీడీపీ	జి.రామచంద్రరాజు	కాంగ్రెస్	33,431
1985	కలిదిండి రామచంద్రరాజు	టీడీపీ	డివి బాలసుబ్రహ్మణ్యం	కాంగ్రెస్	29,133
1989	కలిదిండి రామచంద్రరాజు	టీడీపీ	దండుబోయినపేరయ్య	కాంగ్రెస్	5,283
1994	కలిదిండి రామచంద్రరాజు	టీడీపీ	కె.ప్రభాకరరావు	కాంగ్రెస్	9,208
1999	కలిదిండి రామచంద్రరాజు	టీడీపీ	గోకరాజు రామరాజు	కాంగ్రెస్	14,614
2004	పాతపాటి సర్రాజు	కాంగ్రెస్	కె.రామచంద్రరాజు	టీడీపీ	19,488
2009	వేటుకూరి వి.శివరామరాజు	టీడీపీ	పాతపాటి సర్రాజు	కాంగ్రెస్	15,748
2014	వేటుకూరి వి.శివరామరాజు	టీడీపీ	పాతపాటి సర్రాజు	వైసీపీ	36,231
2019	మంతెన రామరాజు	టీడీపీ	పీవీఎల్ నర్సింహరాజు	వైసీపీ	10,949

ఫ్లాష్ బ్యాక్

రెండుసార్లు మంత్రి పదవులు

ఉండి నియోజకవర్గానికి రెండుసార్లు మంత్రి పదవి వచ్చింది. ఎన్టీఆర్ హయామంలోని 1985లో చిన్నతరహా పరిశ్రమలు, నారా చంద్రబాబునాయుడు సమయంలో విద్యుత్ శాఖ మంత్రిగా కలిదిండి రామచంద్రరాజు (అబ్బాయిరాజు) పని చేశారు. అ తరువాత చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో టీటీడీ చైర్మన్‌గా అబ్బాయిరాజును నియమించారు.

వేద పండితులకు నిలయం

పూర్వం ఆకివీడు ఆధ్యాత్మికతకు నిలయంగా ఉండేది. ఆకివీడు రాణా వీధిలో వేద పండితులు 100 కుటుంబాలు ఉండేవారు. వేద అధ్యయనం, వేదపఠనం జరిగేది. వచ్చిన వారికి లేదనకుండా బ్రాహ్మణ భోజనం (స్వహస్త పాకం) చేసి అరిటాకులో వడ్డించేవారు. యజ్ఞాలు, యాగాలు చేసేవారు. శ్రావణమాసంలో వేద సభ నిర్వహించేశారు.

రైస్ మిల్లులకు ప్రసిద్ధి

పూర్వం ఆకివీడులో సుమారు 35 రైస్ మిల్లులు ఉండేవి. రాను రాను ఆక్వా పరిశ్రమ, రియల్ ఎస్టేట్ రావడంతో రైస్ మిల్లులు తగ్గిపోయాయి. ప్రస్తుతానికి సుమారు 18 రైస్ మిల్లులున్నాయి. వీటి పరిస్థితి కూడా అంతంత మాత్రమే. ఆకివీడులోని హోల్‌సేల్ చేపల మార్కెట్‌లో గతంలో ఏ సమయంలోనైనా ఎటువంటి చేపలు కావాలన్నా దొరికేవి. ఇక్కడ నుంచి ఇతర దేశాలకు చేపలు అధికంగా ఎగుమతులు జరిగేవి. కరోనా తర్వాత నుంచి హోల్‌సేల్ వ్యాపారం కొంతమేర తగ్గింది..



రాజీనామాకు..నో

వైసీపీ నాయకుల ఒత్తిడికి తలొగ్గని వలంటీర్లు

టీడీపీ ప్రకటనతో ఆలోచనలో..

బెడిసికొట్టిన వైసీపీ వ్యూహం



ఏలూరు రూరల్, ఏప్రిల్ 22: ఇంతకాలం ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలుగా చెప్పుకొస్తున్న వలంటీర్లను రాజీనామా చేసి ప్రత్యక్షంగా ఎన్నికల విధుల్లో పాల్గొనాలన్న వైసీపీ నేతల వ్యూహం బెడిసికొడుతోంది. ఇంతకాలం తమ సేవలు వినియోగించుకుని ఇప్పుడు కాదంటారా అంటూ వలంటీర్లు వైసీపీ నేతలపై మండిపడుతున్నారు. తమసేవల వల్లే అటు ప్రభుత్వానికి ఇటు పార్టీకి మంచి పేరు వచ్చిందని ప్రచారం చేసుకుని గొప్పలు చెప్పుకున్న వైసీపీ నాయకులు ఇప్పుడు అవసరం తీరాక బోడిమల్లన్న అంటారా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల కమిషన్ జోక్యంతో వారంతా ఎన్నికల విధుల్లోనే కాదు.. పింఛన్ల పంపిణీకి దూరంగా ఉన్నారు. అలాగే ప్రచారంలో పాల్గొనకుండా అడ్డుకట్ట పడటంతో వైసీపీ నాయకులు వలంటీర్ల సేవలను వినియోగించుకోవడానికి శతవిధాలా ప్రయత్నించారు. చివరకు వలంటీర్ల రాజీనామా అస్త్రాలను తెరపైకి తెచ్చారు. ఈ క్రమంలో ఇప్పటికే కొంతమంది రాజీనామాలు చేసి ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. ఇంతలో టీడీపీ అధినేత చంద్రబాబు వలంటీర్లకు వరాలు ప్రకటించారు. అధికారంలోకి వస్తే వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని భరోసా ఇచ్చారు. గౌరవవేతనం రూ.10 వేలు ఇస్తామని ప్రకటించారు. దీంతో వలంటీర్లలో ఉత్సాహం, ఉద్యోగ భద్రత ఏర్పడింది. వైసీపీ నాయకులు వలంటీర్లపై కొద్దిరోజులుగా ఒత్తిడి మొదలు పెట్టారు. వీరిమాటలు హామీలు, లెక్కచేయని వలంటీర్లు టీడీపీ అధికారంలోకి వస్తే మాకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెగేసి చెబుతున్నారు. రాజీనామా చేసి తమకు ప్రచారం చేయాలని కొందరు బెదిరిస్తున్నా వారు బెదరడం లేదు. ఎన్నికల విధులు, ప్రచారంలో పాల్గొనలేమని తెగేసి చెప్పడంతో వైసీపీ నాయకుల వ్యూహం బెడిసికొట్టినట్లు అయింది.

22-04-2024 పొగాకు ధరలు (రూ.)	పొగాకు కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	సరాసరి
	దేవరపల్లి	268	227	246.29
	జంగారెడ్డిగూడెం-1	272	235	254.30
	జంగారెడ్డిగూడెం-2	272	236	258.69
	కొయ్యలగూడెం	271	235	255.82
	గోపాలపురం	271	235	255.19



నామినేషన్ల సంబరం



నరసాపురంలో నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళుతున్న నాయకర్.. మద్దతుగా కొత్తపల్లి సుబ్బారాయుడు, బందారు మాధవనాయుడు, పొత్తూరి, షరీఫ్ తదితరులు



కార్యకర్తలు, అభిమానుల ర్యాలీ మధ్య చింతమనేని ప్రభాకర్

అభ్యర్థుల నామినేషన్ల సందర్భంగా భారీ ర్యాలీలు, వివిధ వేషధారణలు, ప్రదర్శనలతో కోలాహలం నెలకొంది. ఉండిలో రఘురామ కృష్ణరాజు, నరసాపురంలో నాయకర్, దెందులూరులో చింతమనేని ప్రభాకర్, ఏలూరులో ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌లు సోమవారం నామినేషన్లు దాఖలు చేశారు. అభ్యర్థికి మద్దతుగా పార్టీ కార్యకర్తలు, నాయకులు ర్యాలీగా తరలి వచ్చారు. ఏలూరులో విచిత్ర వేషధారణలు, డప్పు వాయిద్యాలు, భారీ ర్యాలీ మధ్య మహేష్ యాదవ్ నామినేషన్ వేసేందుకు విచ్చేశారు.



రఘురామకు మద్దతుగా గొల్లలకోడేరు నుంచి ర్యాలీగా బయలుదేరిన శ్రేణులు



ఏలూరులో మహేష్ యాదవ్ నామినేషన్ సందర్భంగా ర్యాలీలో ఆకట్టుకున్న వివిధ ప్రదర్శనలు

అభ్యర్థుల ఆస్తులు-అప్పులు

నరసాపురం : బొమ్మిడి నాయకర్ (ఉమ్మడి అభ్యర్థి)



వయసు : 50
విద్యార్హత : డిగ్రీ
చరాస్తులు : 4,52,799
బ్యాంకు డిపాటిట్ : 32,68.515
బంగారం : 2.4 లక్షలు
స్థిరాస్తులు : 17.95 లక్షలు
బ్యాంకు రుణాలు: 1,46,52,087

భార్య సునీత

చరాస్తులు : 1,48,500, డిపాజిట్లు : 21 వేలు
బంగారం : 9.18 లక్షలు
స్థిరాస్తులు : 12.80 లక్షలు, ఇల్లు రూ.6 లక్షలు
రుణాలు : 25.99 లక్షలు

ఏలూరు : ఆళ్ళ నాని (వైసీపీ అభ్యర్థి)



విద్యార్హత : ఇంటర్, బీకాం మధ్యలో నిలుపుదల
చరాస్తులు : రూ.1,39,96,885,
భార్య పేరిట రూ.72,69,897
స్థిరాస్థి : రూ.55,60,650,
సతీమణి పేరిట రూ.5,92,29,200,
సొంతింటి విలువ రూ.2,00,22,000,
భార్య పేరున రూ.6,20,54,000,
బంగారం : రూ.4,55,000,
భార్య పేరున రూ.47,25,000,
అప్పులు : రూ.27,51,846,
భార్య పేరున : రూ.9,45,100,
వాహనాలు : టయోటా (రూ.32,31,000)
వాల్వోకారు (రూ.83,80,000)
భార్యకు మహేంద్రా స్కార్పియో (రూ.16,31,301)
ఇసూజు టీమ్యాక్స్ ట్రూ (రూ.8,71,047)



స్వాధీనం చేసుకున్న నాటు సారా , సామగ్రి

60 లీటర్ల సారా స్వాధీనం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 22 : జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, ఎస్‌ఈబీ అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు ఆదేశాల మేరకు జిల్లాలోని ఎస్‌ఈబీ అధికారులు, సిబ్బంది దాడులు నిర్వహించారు. కొయ్యలగూడెం మండలం కామయ్యకుంట పంచాయతీ లంకపల్లి అటవీ ప్రాంతంలో సారా తయారు చేస్తున్న కేంద్రాన్ని గుర్తించి సోమవారం ఎస్‌ఈబీ ఇన్ స్పెక్టర్ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో కానిస్టేబుళ్ళు వెంకట్, రాంబాబు, సాయిలు దాడి చేశారు. 60 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 2500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీకి ఉపయోగించే సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. పోలవరం ఎస్‌ఈబీ అధికారులకు అప్పగించి తదుపరి చర్యలు చర్యలు నిమిత్తం ఆదేశాలు జారీ చేశారు.

విస్తృతంగా వాహనాల తనిఖీలు

ఏలూరు క్రైం/ కామవరపుకోట, ఏప్రిల్ 22 :రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ దాసరి మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లజాము వరకూ జిల్లాలోని అన్ని ప్రధాన ప్రాంతాల్లోనూ జాతీయ, రాష్ట్రీయ రహదారులపై తనిఖీలు నిర్వహించారు. లాడ్జీలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లలోని అనుమానాస్పద వ్యక్తులను పరిశీలించారు.

రూ.1.59 లక్షలు నగదు స్వాధీనం

కొత్తూరు ఎన్నికల చెక్‌పోస్టులో ఎటువంటి పత్రాలు లేకుండా ఆటోలో తీసుకు వెళు తున్న వ్యక్తి నుంచి లక్షా 59 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెక్‌పోస్టు ఎన్నికల అధికారి ఎండి మొహిద్దీన్ తెలిపారు. మొవ్వ మండలం కూచిపూడి గ్రామానికి చెందిన వ్యక్తి సోమవారం ఆటోలో నగదు తీసుకు వెళుతుండగా నగదుకు సంబందించిన పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకుని ట్రెజరీలో జమచేసే ఏర్పాటు చేశామన్నారు. రామకృష్ణ, సూర్యనాయక్, సుధీర్, నాగార్జున ఉన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు



ఏలూరులో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

'బడేటి చంటి విజయానికి కృషి చేస్తాం'

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 22 : వైసీపీ కార్యకర్తలు భారీగా తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారు. గత కొన్ని రోజుల నుంచి స్థానిక ఎమ్మెల్యే విధానాలు, వైసీపీ అధినాయకుల తీరు నచ్చక టీడీపీలోకి వలసలు ప్రారంభమయ్యాయి. బడేటి క్యాంపు కార్యాలయంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి రాధాకృష్ణయ్య పార్టీ కండువాలు కప్పి వారని ఆహ్వానించారు. 46వ డివిజన్ పించన్‌లైన్‌కు చెందిన మైనార్టీ నేతలు షేక్ సాధిక్, షేక్ ఆసిఫ్, ఎంపీ నూరుల్లా, షేక్ సామి ఆధ్వర్యంలో వందలాదిగా వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. అనంతరం వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలకు ఆకర్షితులై టీడీపీలో చేరుతున్నామన్నారు. బటేటి చంటి నాయకత్వంలో పనిచేసి ఆయన విజయానికి కృషి చేస్తామని వారు తెలిపారు. బడేటి చంటిని గెలిపించాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కందుల రమేష్‌బాబు కోరారు. సోమవారం అరుంధతి, ఎంఆర్‌సీ కాలనీలో ఎంఆర్‌పీఎస్ నాయకులు చంటిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు.

నేడు బడేటి చంటి నామినేషన్..

ఏలూరు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు నామినేషన్ దాఖలు చేస్తారు. స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి ఆర్‌ఆర్.పేట, చేపల తూము సెంటర్, పవర్‌పేట, పాతబస్టాండ్ మీదుగా గడియారపు స్తంభం, కుండీ సెంటర్ మీదుగా భారీ ర్యాలీగా వేలాది మంది కార్యకర్తలతో తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని రిటర్నింగ్ అధికారికి నామినేషన్ దాఖలు చేస్తారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు నామినేషన్‌లో పాల్గొని మద్దతివ్వాలని కోరారు.

నేడు జనసేన అభ్యర్థి పత్సమట్ల నామినేషన్

ఉంగుటూరు, ఏప్రిల్ 22 : ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గ శాసనసభకు జనసేన తరఫున కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు మంగళవారం హనుమ జ్జయంతిని పురస్కరించుకుని నామినేషన్‌ను వేస్తారు. నారాయణపురం మురక్కోడు వద్ద ఉన్న కనకదుర్గమ్మ ఆలయం నుంచి ఉదయం 8.30 గంటలకు ప్రారంభ మయ్యే ర్యాలీకి పెద్దఎత్తున టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పాల్గొనాలని పిలుపు నిచ్చారు. అక్కడి నుంచి ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు చేస్తారు.

టీసీసీ పరీక్షలు ప్రారంభం

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 22 : టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు(టీసీసీ)పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజున డ్రాయింగ్ లోయర్‌గ్రేడ్ పరీక్షకు 33మంది విద్యార్థులు దరఖాస్తుచేసుకోగా 17మంది, హయ్యర్‌గ్రేడ్ పరీక్షకు 11మందికి 8మంది, టైలరింగ్ లోయర్‌గ్రేడ్ పరీక్షకు 42మందికి 21, హయ్యర్‌గ్రేడ్ 25మందికి 18మంది హాజరయ్యారని డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయన్నారు.

ఉపాధ్యాయిని పార్వతీదేవి సేవలు ఆదర్శనీయం



పార్వతిదేవిని సత్కరిస్తున్న సోమసుందర్, ఎంఈవోలు

గణపవరం, ఏప్రిల్ 22: విద్యార్థుల శ్రేయస్సే లక్ష్యంగా వృత్తి నిబద్ధతతో కృషి చేసిన ఆదర్శ ఉపాధ్యాయని జి.పార్వతిదేవి సేవలు భావితరాలకు ఆదర్శమని ఇండియన్ జర్నలిస్టు యూనియన్ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ అన్నారు. ఎ.గోపవరం గ్రామంలో యూపీ పాఠశాల ఉపాధ్యాయరాలిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జి.పార్వతిదేవి అభినందన సభ సోమవారం పాఠశాలలో నిర్వహించారు. ఎంఈవో పి.శేషు అధ్యక్షత వహించారు. ఉపాధ్యాయినిగా, ఉపాధ్యాయ నేతగా, సామాజిక కార్యకర్తగా సమాజానికి విశేష సేవలందించారని సోమసుందర్ ప్రశంసించారు. పార్వతీదేవిని శాలువాతో సత్కరించి మెమొంటో అందజేశారు. ఎంఈవో-2 బాలయ్య, ఉపాధ్యాయ నాయకులు విజయ్‌బాబు, రాజు, మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రత్యేక పోలవరం జిల్లాకు కృషి చేస్తా

పోలవరం, ఏప్రిల్ 22 : ప్రత్యేక పోలవరం జిల్లా కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అభ్యర్థిని దువ్వెల సృజన అన్నారు. సోమవారం దేవరగొంది పునరావాస కాలనీలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంకురు బాబూరావు నివాసం వద్ద మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు ముచ్చిక సీత అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తికాకపోవడంతో అభివృద్ధి లేక వెనుకబ డిందన్నారు. పోలవరానికి రక్షణగా వేసిన నెక్లెస్ బండ్, అంతర్గత డ్రైనేజీ వ్యవస్థలు, శ్మశానం సమస్యలను పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిష్కరిస్తానన్నారు. సీనియర్ నాయకులు వంకా నాగరాజు, కాంగ్రెస్ మండల కార్యదర్శి తోలేటి రఘుబాబు పాల్గొన్నారు.

క్రైం వార్తలు

విద్యుత్ వైర్లు తెగిపడి పామాయిల్ తోట దగ్ధం



మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పెదవేగి, ఏప్రిల్ 22 :విద్యుత్ వైర్లు తెగిపడి పామాయిల్ తోటలో అగ్నిప్రమాదం సంభవించింది. ఏలూరు సహాయ జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి వి.రామకృష్ణ తెలిపిన వివరాలివి.. మామిళ్ళపల్లి జయప్రకాష్‌కు చెందిన రెండెకరాల పామాయిల్ తోటలో సోమవారం సాయంత్రం విద్యుత్ వైర్లు తెగిపడి మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న ఏలూరు అగ్నిమాపకశాఖ సకాలంలో స్పందించి మంట లను అదుపు చేయడంతో చుట్టుపక్కల పంటపొలాలకు మంటలు వ్యాపించలేదు. ఈ ప్రమాదంలో రూ.లక్ష మేర ఆస్తి నష్టం సంభవించిందని రామకృష్ణ తెలిపారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

టి.నరసాపురం, ఏప్రిల్ 22 : నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. మల్లప్పగూడెం గ్రామంలో ప్రభుత్వం నిషేధించబడిన నాటు సారాను తయారు చేసి విక్రయిస్తున్నారనే సమాచారంతో సిబ్బందితో సోమవారం దాడి చేసి పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

ఎక్సైజ్ దాడులు

చింతలపూడి, ఏప్రిల్ 22 : చింతలపూడి ఎస్‌ఈబీ సర్కిల్ పరిధిలో రాఘవాపురం, రేచర్ల, కొండగూడెం గ్రామాల్లో దాడులు జరిపి ఒకరిని అరెస్ట్ చేశామని ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ డి.ఎస్.ఎస్.వి ప్రసాద్ తెలిపారు. పది లీటర్ల సారా సీజ్ చేశారు. ఓ మహిళ నుంచి 12 బీర్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. 700 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని తెలిపారు.

అత్యాచారయత్న కేసులో ఐదేళ్ల జైలు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 22 : అత్యాచార యత్న కేసులో ఓ వ్యక్తిపై నేరం రుజువు కావడంతో ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఏలూరులోని మహిళా కోర్టు జడ్జి, ఐదో అదనపు సెషన్సు జడ్జి రాజేశ్వరి సోమవారం తీర్పు చెప్పారు. 2015 డిసెంబరు 17 సాయంత్రం కామవరపుకోట మండలంలోని ఓ గ్రామ శివారులో మేకలను 35 ఏళ్ల మహిళ మేపుతుంది. వీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన నిజారపు సత్యనారాయణ అలియాస్ సత్తియ్య (23) అనే యువకుడు ఆ మహిళ వద్దకు వెళ్ళి అత్యాచారయత్నానికి ప్రయత్నించారు. ఆమె అతడిని నెట్టివేసి కేకలు వేయగా సమీపంలో ఉన్న ఆయన తండ్రి వచ్చేటప్పటికీ పారిపోయాడు. ఈ సంఘటనపై తడికలపూడి ఎస్‌ఐ విష్ణువర్ధన్‌రెడ్డి కేసు నమోదు చేసి సత్తియ్యను అరెస్టు చేశారు. ఈ కేసు ఏలూరులోని ఐదో అదనపు అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో విచారణ జరిగింది. నిందితుడైన సత్తియ్యపై నేరం రుజువు కావడంతో ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించాలని తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ డీవీ రామాంజనేయులు వాదించగా ప్రాసిక్యూషన్‌కు తడికలపూడి ఎస్‌ఐ ఎం జయబాబు, హెడ్‌కానిస్టేబుల్ కొండలరావు, కోర్టు లైజన్ ఆఫీసర్లు అయిన ఏఎస్‌ఐలు సిసిలి, రుక్మందరావు సహకరించారు.

టీడీపీ జోష్..

కూటమి అభ్యర్థుల నామినేషన్లకు తరలివెళ్లిన పార్టీల శ్రేణులు

జంగారెడ్డిగూడెం/లింగపాలెం ఏప్రిల్ 22 : కూటమి అభ్యర్థుల నామినేషన్లకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం తరలివెళ్లారు. ఈ సం దర్భంగా టీడీపీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. ఉదయం గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామిని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో కలసి చింతలపూడి కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. లింగపాలెం మండలం రంగాపురం గ్రామంలోని సత్యనారాయణస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం భారీ ర్యాలీగా చింతలపూడిలో నామినేషన్ వేసేందుకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్‌చంద్ర శేష, మాజీ ఎమ్మెల్యే గంటా మురళీ, తదితరులు ఉన్నారు.

నామినేషన్లకు తరలివెళ్లిన నాయకులు

పోలవరం/కుక్కునూరు/ ఉంగుటూరు/పెదపాడు : ఏలూరు జిల్లా టీడీపీ ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ నామినేషన్ నిమిత్తం ఏలూరుకు పోలవరం మండలం నుంచి సోమవారం నాలుగు వందల మంది టీడీపీ మండల నాయకులు తరలివెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షుడు బొడ్డు కృష్ణ నాయకత్వంలో నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు ఆదేశాలతో నామినేషన్ల కార్యక్రమానికి 30 వాహనాల్లో నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్ళినట్లు టీడీపీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ మంగిన కొండ తెలిపారు. కుక్కునూరు మండలం నుంచి టీడీపీ మండల అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 70 వాహనాలపై తరలి వెళ్లారు. టీడీపీ నాయకులు కోటగిరి సత్యనారాయణ, పిచుక రాజు, కుక్కునూరు మురళి, ఉన్నారు. ఉంగుటూరు మండలంలో నారాయణపురం సర్పంచ్ దిడ్ల అలకనంద శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. దెందులూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థిగా చింతమనేని ప్రభాకర్ నామినేషన్ కార్యక్రమానికి పెదపాడు మండలంలోని అన్ని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు మోటా రుసైకిళ్ల, కార్లతో ర్యాలీగా దెందులూరు వెళ్లారు.



కుక్కునూరు నుంచి ఏలూరు తరలివెళ్లిన టీడీపీ నాయకులు

నగరంలో పోలీసు బందోబస్తు

ఏలూరు క్రైం : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నామినే షన్ల ప్రక్రియ జరుగుతున్న దృష్ట్యా జిల్లాలోని నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏలూరు పార్లమెంటు నియోజ కవర్గానికి సంబంధించి జిల్లా కలెక్టరేట్‌లో నామినేషన్లను జిల్లా కలెక్టర్ స్వీకరిస్తున్నారు. ఈక్రమంలో కలెక్టరేట్‌కు వెళ్లే అన్ని మార్గాలను పోలీసు లు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఏలూరు శాసనసభ నియోజక వర్గానికి సంబంధించి ఏలూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి అయిన డిప్యూటీ కలెక్టర్ ముక్కంటి ఏలూరు తహసీల్దార్ కార్యాలయంలో నామి నేషన్లు స్వీకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో అన్ని కార్యాలయాలకు వెళ్లే అన్ని మార్గాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు.

సీతారామ్మోహనరావును మద్దతు కోరిన చింతమనేని



సీతారామ్మోహనరావును కలిసి ఆశీస్సు తీసుకుంటున్న చింతమనేని

దెందులూరు, ఏప్రిల్ 22 : దెందులూరు గ్రామ ప్రముఖులు, ప్రముఖ ఆడిటర్, విజయవాడ డాక్టర్ రమేష్ గుండె ఆసుపత్రి ఛైర్మన్, మద్దిపాటి చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ మద్దిపాటి సీతారా మ్మోహన రావును దెందులూరు టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి చింతమనేని ప్రభాకరరావు కలిసి మద్దతు కోరారు. సోమవారం దెందులూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసే ముందు దెందులూరులోని సీతారామమ్మోహనరావు ఇంటికి వెళ్లి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం దెందులూరు ఆర్‌వో కార్యాలయానికి వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. దెందులూరు నియోజకవర్గ ప్రజలకు మంచి చేయాలనే తపన నెలరవేరు తుందని ఎమ్మెల్యేగా భారీ మోజార్టీతో గెలుస్తావని ఆయన ఆశీర్వాదించారు.


సొంగా రోషన్ నామినేషన్‌కు జన నీరాజనం



ఫాతిమాపురం సెంటర్లో గజమాల వేస్తున్న పార్టీశ్రేణులు

చింతలపూడి, ఏప్రిల్ 22: కూటమి టీడీపీ అభ్యర్థిగా సొంగా రోషన్‌కు మార్ నామినేషన్ దాఖలుకు తెలుగుదేశం, జనసేన, బీజేపీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు భారీగా స్వాగతం పలుకుతూ ర్యాలీలో పాల్గొన్నా రు. అడుగడుగునా పూలతో స్వాగతం, మహిళల హారతులు, గజమాలలతో స్వాగతం పలికారు. మోటారుసైకిల్ ర్యాలీలు, జెండా ప్రదర్శనలు, బాణసం చా కాల్పులతో హోరె త్తించారు. చింతలపూడి వడ్డెరగూడెం నుంచి వంద ట్రాక్టర్లతో అభిమానులు వెళ్లి స్వాగతం పలికారు. జంగారెడ్డిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం పూజలు జరిపిన అనంతరం రంగాపురం చేరుకుని సత్యనారాయణస్వామి ఆలయంలో పూజలు జరిపా రు. అక్కడి నుంచి గోకవరం, పాశ్వానగరం, పిమ్మిరెడ్డిపల్లి, ప్రగడవరం, ఫాతిమాపురం, ఆంథోనినగర్ మీదుగా చింతలపూడి ఆర్వో కార్యాలయానికి చేరుకుని నామినేషన్ దాఖలు చేశారు. ప్రగడవరం నుంచి భారీగా అభిమా నులు పాల్గొన్నారు. ఫాతిమాపురం, చింతలపూడి బోసుబొమ్మ సెంటర్‌లలో గజమాలలతో స్వాగతం పలికారు. పలుచోట్ల మహిళలు హారతులు ఇచ్చారు. ఆటోలు, మోటారు సైకిల్ ర్యాలీలు, సీతానగరం, వెంకటాపురం, బట్టువారిగూడెం, సుప్రీమ్‌పేట, ఎన్‌టీఆర్‌కాలనీ, పలు దళితవాడల నుంచి కూడా కార్యకర్తలు తరలివచ్చారు. ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు డ్రసోడతో బాజాలు మోగిస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. కోదండరామాలయం వద్ద నాగిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన గిరిజన లంబాడీలు సంప్రదాయ దుస్తులు ధరించి పూలతో స్వాగతం పలికారు. ర్యాలీలో సొంగా రోషన్‌కు మార్, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ పలుచోట్ల ప్రసంగిస్తూ కూటమి ప్రభుత్వమే రాష్ట్ర అభివృద్ధి చేయగలదని అభ్యర్థులను గెలిపించాలన్నారు. సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ చింతలపూడి అభ్యర్థే లక్ష్యమని, చింతలపూడి ఎత్తిపోతల పథకం కూటమి ఆధ్వర్యంలోనే పూర్తవుతాయన్నారు. గెలిచిన రెండేళ్లలో చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేయిస్తానన్నారు. చింతలపూడి పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేయిస్తానని, రోడ్లు మొత్తం వేయించి అందమైన గ్రామాలుగా తీర్చిదిద్దుతా నన్నారు. ఈ రాష్ట్రానికి చంద్రబాబు ముఖ్యమంత్రిని చేయటమే లక్ష్యమ న్నారు. జగన్ పాలనను పారదోలుదామన్నారు. రాష్ట్రాభివృద్ధిని కాంక్షించి రెండు ఓట్లు సైకిల్ గుర్తుకే వేయాలన్నారు. ర్యాలీలో టీడీపీ నాయకులు జగ్గవరపు ముత్తారెడ్డి, మాటూరి వెంకటరామయ్య, గరిమళ్ళ చలపతిరావు, పక్కాల వెంకటేశ్వరరావు, బోడా నాగభూషణం, అనీష్‌కుమార్, తాటి అప్పా రావు, రాజారత్నం, ప్రభాకర్, మిద్దె సత్యనారాయణ, కొమ్మరాజు సత్యనారా యణ, కక్కిరాల నాగేశ్వరరావు, రాజారెడ్డి, శ్యామ్‌చంద్రశేషు, తాళ్ళూరి చంద్ర శేఖర్‌రెడ్డి, కొత్తపూడి శేషగిరిరావు, బాణావతు శంకర్, జనసేన నాయకులు మేకా ఈశ్వరయ్య, చీదరాల మధుబాబు, పి.నాగవిజయ్‌కుమార్, బీజేపీ నాయకులు టి.వరప్రసాద్, పలువురు నాయకులతో పాటు నాలుగు మండలాల నుంచి భారీగా వేలాదిమంది తరలివచ్చారు.

టెన్త్ ఫలితాల్లో విద్యార్థుల విజయకేతనం



ఎస్.నందిని ప్రియ(587) | జి.ఎస్.తన్మయి (587) | పి.జ్ఞానదీపిక (584) | పి.అఖిల (582) | సీహెచ్.ప్రశాంత్ (580)
వీఆర్ తేజ (578) | కె.ఎం.సతీష్ (578) | ఎం.పూజిత (576) | ఆర్.కృష్ణ తేజ (574) | జశ్వంత్ వివేక్ (573)

ఉంగుటూరు మండలంలో 67.37 శాతం

ఉంగుటూరు, ఏప్రిల్ 22 : పదో తరగతి పరీక్షా ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో ఉంగుటూరు మండలంలో 613 మంది పరీక్షలు రాయగా 413 మంది ఉత్తీర్ణులై 67.37 శాతం సాధించింది. మండల ప్రథమ స్థానం కైకరం విద్యార్థిని శానం నందినిప్రియ(587) మార్కులు, నారాయణపురం హైస్కూల్ విద్యార్థి గోపి వెంకట రవితేజకు(578) మార్కులు సాధించారని ఎంఈవో కాండ్రేగుల శ్రీనివాసరావు తెలిపారు.

భీమడోలు మండలంలో 78 శాతం

భీమడోలు:మండలంలో 78 శాతం ఉత్తీర్ణత సాధించామని ఎంఈవో భాస్కరకుమార్ తెలిపారు. తెలిపారు. భీమడోలు మానస హైస్కూలు విద్యార్థిని దేవి అనుష్క 591 మార్కులతో మండల ప్రథమ స్థానంలో నిలిచిందని, గుండుగొలను జడ్పీ హైస్కూలుకు చెందిన జశ్వంత్ వివేక్ 573 మార్కులు సాధించాడని తెలిపారు.

నిడమర్రు మండలంలో 68 శాతం

నిడమర్రు : టెన్త్ ఫలితాలలో 68 శాతం ఉత్తీర్ణత సాధించామని ఎంఈ వో కె.రాంబాబు తెలిపారు. మండలంలో 335 మంది విద్యార్థులకు 229 మంది ఉత్తీర్ణత సాధించారు. నిడమర్రు ఉన్నత పాఠశాలకు చెందిన కె.సాయి సంధ్య 577 మార్కుల సాధించి మండలం టాపర్‌గా నిలిచింది. విద్యార్థిని మండల విద్యాశాఖాధికారులు పి.శేషు, కె.రాంబాబు అభినందించారు.

కామవరపుకోట మండలంలో 74 శాతం

కామవరపుకోట :మండలవ్యాప్తంగా 74 శాతం ఉత్తీర్ణత శాతం సాధించా మని ఎంఈవో డి.సుబ్బారావు తెలిపారు. మండలంలో ప్రథమస్థానం ఎస్.నెహశ్రీరామసాయికి 576 సాధించి టాపర్‌గా, 568 మార్కులతో కె.సాత్విక సాధించిందని తెలిపారు.

దెందులూరు మండలంలో 68.47 శాతం

దెందులూరు : మండలంలో 68.47 శాతం ఉత్తీర్ణత సాధించామని ఎంఈవో తెలిపారు. పదో తరగతిలో 647 మందికి 443 మంది ఉత్తీర్ణుల య్యారన్నారు. దెందులూరుకు చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి రామిశెట్టి నాగమణిక్యం(563) టాపర్‌గా నిలిచారన్నారు.

పెదవేగి మండలంలో 76.6 శాతం

పెదవేగి :మండలంలో 76.6 శాతం ఉత్తీర్ణత సాధించారని, మొత్తం 885 మందికి 678 మంది ఉత్తీర్ణులయ్యారని ఎంఈవోలు సీహెచ్‌బుధవాస్, అరుణ్‌కుమార్ తెలిపారు. పెదవేగిలోని ఎస్ఎంసీ హైస్కూల్ విద్యార్థిని పెద్దిశెట్టి జ్ఞానదీపిక 584 మార్కులతో మండలం టాపర్‌గా నిలవగా, లక్ష్మీపురం శివారు శ్రీసాయి హైస్కూల్ విద్యార్థి మాదల పూజిత 576తో ద్వితీయ స్థానం సాధించారని తెలిపారు.

పెదపాడు మండలంలో 73 శాతం

పెదపాడు : మండలంలో 591 మంది విద్యార్థులకు 73 శాతంతో 429 ఉత్తీర్ణత సాధించారని ఎంఈవోలు సబ్బితి నరసింహమూర్తి, దేవినేని వెంకటరమణ తెలిపారు. అప్పనవీడు జిల్లాపరిషత్ విద్యార్థిని పి.అఖిల 582 మార్కులతో ప్రథమ, కలపర్రు విద్యార్థిని కె.మహాలక్ష్మి 548 మార్కులతో ద్వితీయ స్థానాన్ని పొందారు.

వేలేరుపాడు మండలంలో 88 శాతం ఉత్తీర్ణత

వేలేరుపాడు : పదో తరగతి పరీక్షల్లో మండలంలోని నాలుగు ఉన్నత పాఠశాలల నుంచి మొత్తం 152 మంది విద్యార్థులు హాజరుకాగా 88 శాతంతో 134 మంది ఉత్తీర్ణత పొందారు. జడ్పీ హైస్కూల్‌కు చెందిన బుర్రి నాగమౌనిక 556 మార్కులతో మండల ప్రథమ స్థానం సాధించిందని ఎంఈవో కె.శ్రీనివాసరావు తెలిపారు.

కుక్కునూరు మండలంలో 82 శాతం

కుక్కునూరు, ఏప్రిల్ 22 :మండలంలో 82 శాతం ఉత్తీర్ణత సాధించామని మొత్తం 298 మందికి 244 మంది ఉత్తీర్ణులయ్యారని ఎంఈవో గిరి భగవాన్‌దాస్ తెలిపారు. లిటిల్ స్టార్ హైస్కూల్ విద్యార్థి కె.స్మృతి 572 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది.

పోలవరం మండలంలో 76.05 శాతం

పోలవరం : మండలంలో 76.05 శాతం ఉత్తీర్ణత సాధించామని, ఈసారి కూడా బాలికలే అగ్రస్థానంగా నిలిచారని విద్యాశాఖాధికారి తెలిపారు. గూటాలకు చెందిన గర్రె తన్మయి (587) మార్కులు సాధించి మండల టాపర్‌గా, కరిబండి ప్రణీత 567 మార్కులు సాధించి ద్వితీయ స్థానం, 545 మార్కులు సాధించి గర్రె కార్తీక్ తృతీయ సాధనం సాధించిందన్నారు.

జీలుగుమిల్లి మండలంలో 63 శాతం

జీలుగుమిల్లి : మండలంలో 63 శాతం ఉత్తీర్ణ సాధించామని మొత్తం 367 మందికి 233 మంది ఉత్తీర్ణులయ్యారని ఎంఈవోలు ఎం.శ్రీనివాస్, ఎస్.బుచ్చియ్య తెలిపారు. జీలుగుమిల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.నవ్యశ్రీలక్ష్మి (549) మార్కులతో మండలంలో టాపర్‌గా నిలిచింది.

చింతలపూడి మండలంలో 77.69 శాతం

చింతలపూడి : మండలంలో 77.69 శాతం ఉత్తీర్ణత సాధించామని విద్యాశాఖాధికారి తెలిపారు. నాగిరెడ్డిగూడెం గురుకుల బాలికల పాఠశాలకు చెందిన ఎం.అనురాధ, కె.హని ఒక్కొక్కరూ 584 మార్కులు సాధించారు. మొత్తం 1281 మందికి 1070 మంది ఉత్తీర్ణత సాధించారు.

ద్వారకాతిరుమల మండలంలో 83.25 శాతం

ద్వారకాతిరుమల: మండలంలో ఉత్తీర్ణతా శాతం 83.25 వచ్చిందని ఎంఈవో పరసా వెంకట్రావు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు 77.75 శాతం రాగా ప్రైవేటు స్కూళ్లకు 94.59 శాతం ఉత్తీర్ణత లభించినట్టు వివరించారు. ఏపీఎస్ డబ్ల్యూఆర్ స్కూల్‌కు చెందిన జంగా ప్రసన్నకు 579 మార్కులతో మండల ఫస్ట్ వచ్చిందన్నారు.

జంగారెడ్డిగూడెం మండలంలో 83.25 శాతం

జంగారెడ్డిగూడెం :జంగారెడ్డిగూడెం బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థి చింతపల్లి ప్రశాంత్ 580 మార్కులు, 578 మార్కులు కుందు మోహన్‌సతీష్, 574 మార్కులు గండి రాకేష్ సాధించి మండల స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

గణపవరం మండలంలో 74 శాతం

గణపవరం : గణపవరం మండలంలో 74 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఎంఈవో శేషు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులు పరీక్షలకు 729 మంది హాజరుకాగా 540 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ప్రభుత్వ పాఠశాలలోని మండల స్థాయిలో ప్రథమ స్థానంలో ఎన్.మేఘన 581 మార్కులు సాధించిందన్నారు.

లింగపాలెం మండలంలో 87.32 శాతం

లింగపాలెం : మండలంలో 87.32శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈవో లు కె.రామారావు, జె.రవీంద్ర తెలిపారు. రంగాపురం గ్రామానికి చెందిన విద్యార్థి కుప్పాల రాజు 576 మార్కులు సాధించి, మండలంలోనే మొదటిస్థానంలో నిలిచినట్టు వారు తెలిపారు.

శర్వాణి విద్యార్థులకు టాప్ మార్కులు



పవన్‌కుమార్ | నిహారిక | ప్రేమకుమారి

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 22 : పదో తరగతి పరీక్షల ఫలితాల్లో స్థానిక శ్రీశర్వాణి స్కూలు విద్యార్థులు యు.పవన్‌కుమార్ 589 మార్కులు, టి.నిహారిక 586, పి.ప్రేమకుమారి 585 మార్కులతో టాపర్లుగా నిలిచారని స్కూలు హెచ్‌ఎం సీహెచ్.సత్యశారద, డైరెక్టర్ మదనమోహనరాజు ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 110 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 108 ఫస్ట్ క్లాసుల్లో ఉత్తీర్ణత సాధించారని వివరించారు. ఎనిమిది మందికి 580కిపైగా మార్కులు వచ్చాయన్నారు. టాపర్లను అభినందించారు.

ఆధ్యాత్మికం

నేటినుంచి రాట్నాలమ్మ తిరునాళ్లు



పెదవేగి, ఏప్రిల్ 22 : రాట్నాలకుంట రాట్నాలమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమవుతాయని ఈవో ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఉదయం నాలుగు గంటలకు చిత్తా నక్షత్రయుక్త మీనలగ్నమందు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచన, అఖండ జ్యోతి ప్రజ్వలన, కుంకుమ పూజలతో తిరునాళ్ళు ప్రారంభమవుతాయి. ఈనెల 27వ తేదీ వరకు తిరునాళ్ల జరుగుతాయని నిత్యపూజలు, అభిషేకాలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కోలాటం వంటివి నిర్వహిస్తామని తెలిపారు. శ్రీరాట్నాలమ్మవారు రోజుకో అలంకరణతో భక్తులకు దర్శనమిస్తారు. తొలిరోజు మంగళవారం రాట్నాలమ్మవారు బాలా త్రిపురసుందరి అలంకరణలో దర్శనమిస్తారు.

రామలింగేశ్వరాలయంలో సామూహిక పారాయణం

ఉంగుటూరు, ఏప్రిల్ 22 : కైకరం పార్వతీ సమేత రామలింగేశ్వ రాలయంలో శివలింగము, పార్వతీదేవి, కాలభైరవుడు, శ్రీచక్ర యంత్ర రాజప్రతిష్ఠ సందర్భంగా 41 రోజులపాటు లలితా సహస్రనామ స్తోత్ర సామూహిక పారాయణం సోమవారంతో పూర్తయ్యింది. ఈ సందర్భంగా అమ్మవారికి సామూహిక సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 153 మంది మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా నగరేశ్వరుని కల్యాణోత్సవం

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 22 : దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని అగ్ర హారంలోని గంగా వింధ్య వాసిని సమేత నగరేశ్వరస్వామి వార్షిక దివ్య కల్యాణ మహోత్సవం వేదమంత్రోచ్ఛరణల నడుమ ఆశేష భక్తుల సమక్షంలో సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయ ప్రధాన అర్చకులు నాని ఎదుర్కోల సన్నాహం నిర్వహించారు. భక్తులు అమ్మవార్లను స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈవో గుబ్బల రామపెద్దింట్లరావు, సిబ్బంది భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు. కల్యాణ మహోత్సవం సందర్భంగా ఆలయ పరిసరాలు, ప్రాంగణాన్ని పంచరంగుల తోరణాలు, విద్యుత్ దీపాలంకరణతో తీర్చిదిద్దారు.

ఎన్డీఏకే బీసీ సంక్షేమ సంఘ మద్దతు



ఐక్యత చాటుతున్న బీసీ సంఘ నాయకులు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 22 : రాష్ట్ర భవిష్యత్ కోసం ఎన్నికల్లో ఎన్డీఏకు మద్దతు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్‌రావు ప్రకటించారని, సంఘ జిల్లా అధ్యక్షుడు భీమవరపు పాపారావు, నగర అధ్యక్షుడు మారగాని చంద్రకిరణ్ తెలిపారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాపారావు మాట్లాడుతూ ఇటీవల గుంటూరులో రాష్ట్రస్థాయి బీసీ సంక్షేమ సంఘం భవిష్యత్ కార్యాచరణ సమావేశం జరిగిందని ఈ మేరకు ఎన్‌డీఏకు మద్దతు తెలుపుతూ తీర్మానం ఆమోదించినట్లు తెలిపారు. జగన్ సర్కారు వచ్చి ఐదేళ్లయినా బీసీలకు ఎటువంటి ప్రయోజనం చేకూరలేదని ఆరోపించారు. ఎన్నికల అనంతరం బీసీ సంక్షేమ సంఘం బీసీల అభివృద్ధికి సంబంధించిన కార్యాచరణతో ముందుకు సాగుతుందన్నారు. నగర అధ్యక్షుడు మారగాని చంద్రకిరణ్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం 56 బీసీ కార్పొరేషన్‌లను ఏర్పాటు చేశారు కాని, నిధులు మాత్రం ఒక్క రూపాయి ఇవ్వలేదని బీసీ ఆర్థిక సంస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమితో ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. ఎంపీ, అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులకు ప్రచారం చేపడతామని ప్రకటించారు. పద్మశాలీ సంఘం నాయకులు వానపల్లి నాగరాజు, మరీదు శ్రీనివాస్, బల్లా శివప్రసాద్ పాల్గొన్నారు.

ముగిసిన శ్రీరామనవమి వేడుకలు

ఏలూరు కల్చరల్, ఏప్రిల్ 22: శనివారపుపేట తివాచీసెంటర్ దొండపాడు రోడ్డులో ఉన్న వీరాంజనేయస్వామి దేవస్థానం 21వ సీతారామ కల్యాణ మహోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ముగింపు సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మహా అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈనెల 17 నుంచి 21వరకు వైభవంగా కల్యాణ మహోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్స్‌కు.. సీఎం జగన్ తీవ్ర అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న పెన్షనర్స్

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 22: ప్రభుత్వ ఉద్యోగులుగా నలభై ఏళ్లపాటు సేవలు చేసి అందించిన పిం ఛనర్లకు జగన్మోహ న్‌రెడ్డి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని ఏపీ పెన్షనర్స్ పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సుబ్బరాయ, పెద్దన్న గౌడ్, ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం పింఛనర్స్ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్ అయిన తమకు ఒకటో తేదీన పింఛన్ ఇవ్వకుండా చేశారన్నారు. 20వ తేదీ వరకు పింఛన్ ఇవ్వకపోవడంతో మా ఆరోగ్యాలు క్షీణిస్తున్నాయన్నారు. ఒకటో తేదీన బటన్ నొక్కి నవరత్నాల లబ్ధిదారులకు పింఛన్లు వేస్తున్నారని మాపై నిర్లక్ష్యం వహిస్తున్నారని వాపోయారు. రాబోయే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి

లింగపాలెం, ఏప్రిల్ 22: రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు దృష్ట్యా ప్రజలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కె.గోకవరం పీహెచ్‌సీ వైద్య అధికారి డాక్టర్ ఆర్.కృష్ణకిషోర్ సూచించారు. సోమవారం రంగాపురంలో వడ దెబ్బపై తీసుకో వాల్సిన జాగ్రత్తలపై సిబ్బందితో సమావేశం నిర్వహించారు., ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు వడదెబ్బపై అవగాహన కల్పించాలని ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలకు సూచించారు. ఆరోగ్యవిస్తరణ అధికారి అబ్రార్ హుస్సేన్, ఉమామహేశ్వరరావు, రాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ ఉత్తీర్ణత ఇలా..

కైకలూరు మండలంలో 72 శాతం ఉత్తీర్ణత


ఆర్. లలిత

కైకలూరు, ఏప్రిల్ 22: పదో తరగతి పరీక్షల్లో కైకలూరు మండలంలో 72 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు డి రామారావు తెలిపారు. సోమవారం విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఆర్. లలిత 580మార్కులతో మొదటి స్థానాన్ని, భుజబలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి కె నవ్య శ్రావణి 578 మార్కులతో ద్వితీయ స్థానాన్ని, కైకలూరు బాలికల జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన షేక్ నగీనా 527 మార్కులతో తృతీయ స్థానాన్ని సాధించారు.

ముదినేపల్లి మండలంలో 67 శాతం


దీక్షిత

ముదినేపల్లి, ఏప్రిల్ 22 : ఈ ఏడాది జరిగిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ముదినేపల్లి మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూళ్ల విద్యార్థులు 67 శాతం ఉత్తీర్ణతను సాధించారు. మండలంలోని జడ్పీ హైస్కూళ్ల నుంచి 420 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 282 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని ఎంఈవో నరేష్‌కుమార్ తెలిపారు. కాగా ముదినేపల్లి, వడాలి జడ్పీ హైస్కూళ్ల విద్యార్థులు ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. వడాలి హైస్కూల్‌కు చెందిన పి.దీక్షిత 600 మార్కులకు గానూ 583, బోడా సుష్మ 582, ముదినేపల్లి హైస్కూల్‌కు చెందిన పల్లపోలు హేమ రేవంత్ 578 మార్కులు సాధించి మండల టాపర్లుగా నిలిచారు.

కలిదిండి మండలంలో 65 శాతం


నరసింహ

కలిదిండి: మండలంలో టెన్త్ ఫలితాల్లో 65 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ఎంఈవో ప్రభాకర్ బాబు తెలిపారు. మొత్తం 9 జడ్పీ హైస్కూళ్లలో 576 మంది విద్యార్థులు హాజరు కాగా, 403 మంది ఉత్తీర్ణుల య్యారు. కలిదిండి జడ్పీ హైస్కూల్ విద్యార్థి ఎ.డి.వి.ఎల్. నరసింహ 554 మార్కులు, భాస్కరరావుపేట జడ్పీ హైస్కూల్‌కి చెందిన ఎం.బాలాజీ 549 మార్కులు సాధించగా ప్రైవేట్ పాఠశాలల్లో 97 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించా రు. 110 మందికి 106 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ఎంఈవో వివరించారు.

మండవల్లి మండలంలో 61.42 శాతం


సాయిశ్రీ

మండవల్లి, ఏప్రిల్ 22: మండవల్లి మండలంలోని పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 61.42 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండలం నుంచి 321 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 234 మంది ఉత్తీర్ణత సాధించారు. మండల స్థాయిలో మండవల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థిని మారడని సాయిశ్రీ 578 మార్కులతో ప్రథమ స్థానం సాధించగా కానుకొల్లు జడ్పీ హైస్కూల్ విద్యార్థిని గొర్ల హేమశ్రీ 575 మార్కులతో ద్వితీయ స్థానం సాధించింది.

నూజివీడు డివిజన్‌లో 79 శాతం ఉత్తీర్ణత

నూజివీడు టౌన్, ఏప్రిల్ 22: 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో నూజివీడు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 79 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు నూజివీడు డీవైఈవో సేవ్యా తెలిపారు. ఆగిరిపల్లి మండలంలో గల ఐదు పాఠశాలల్లో 401 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 309 మంది పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి 77 శాతం ఫలితాలు సాధించారన్నారు. అదే విధంగా చాట్రాయి మండలంలోని ఏడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 290 మంది విద్యార్థులకు గాను 242 మంది ఉత్తీర్ణత సాధించి, 83 శాతం ఫలితాలు సాధించారని ఇక ముసునూరు మండలంలోని 8 పాఠశాలలకు గాను 508 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 425 మంది ఉత్తీర్ణత సాధించి 54 శాతం ఫలితాలు సాధించారు. నూజివీడు మండలంలో మొత్తం 11 పాఠశాలలకు గాను 828 మంది పరీక్షలకు హాజరు కాగా, 627 మంది ఉత్తీర్ణత సాధించారని, ఇక్కడ 76 శాతం ఫలితాలు వచ్చాయన్నారు.

ఆగిరిపల్లి: టెన్త్ ఫలితాల్లో ఆగిరిపల్లి మండల ప్రథమ స్థానం అడవి నెక్కలం జడ్పీ హైస్కూల్‌కు చెందిన కే. కుమార్‌సింగ్ 536 మార్కులతో సాధించాడు. ఆగిరిపల్లి జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఆర్.లాస్నిక 534 మార్కులతో రెండో స్థానం, ఈదులగూడెం జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎ. మధులత 530 మార్కులతో తృతీయస్థానంలో నిలిచింది. కాగా మండలంలో 594 మంది టెన్త్ పరీక్షలకు హాజరు కాగా 468 మంది ఉత్తీర్ణులై హాజరు శాతం 78.79 వచ్చినట్లు ఎంఈవో సర్వేశ్వరరావు తెలిపారు.

ముసునూరు మండలంలో ఉత్తీర్ణత 79శాతం


తేజసాయి


షణ్ముఖ

ముసునూరు, ఏప్రిల్ 22: ముసునూరు మండలంలో పదవ తరగతి పరీక్షల్లో బాలికలు సత్తా చాటారు. మండలంలో 79 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఏడు జడ్పీ పాఠశాలల్లో 429 మంది పరీక్షలకు హాజరుకాగా 309 మంది ఉత్తీర్ణుల య్యారు. వీరిలో 171 మంది బాలికలు ఉన్నారు. మండలం టాపర్లుగా రమణక్కపేట, వేల్పుచర్ల జడ్పీ పాఠశాలలకు చెందిన ఆర్.తేజసాయి 574, డి.వెంకట షణ్ముఖ 574 మార్కులతో ప్రథమస్థానంలో, రమణక్కపేటకు చెందిన విద్యార్థిని 573 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఎంఈవో సుబ్బారావు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు అభినందించారు. ముసునూరు గురుకుల బాలికల పాఠశాలలో పదవతరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. తోట చిట్టిపావని 577మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచిందని ప్రిన్సిపాల్ ప్రవీణ తెలిపారు. అలాగే కె.హాసిని 572 , జి.వెన్నెల 570 మార్కులు సాధించినట్లు తెలిపారు.

చాట్రాయి మండలంలో 84 శాతం


జశ్వంత్

చాట్రాయి: చాట్రాయి మండల ప్రభు త్వ హైస్కూల్స్ విద్యార్థులు 84 శాతం ఉత్తీర్ణత సాధించారు. చిన్నంపేట జడ్పీ హైస్కూల్ విద్యార్థి జె. జశ్వంత్ 586 మార్కులతో మండలంలో ప్రథమ స్థానంలో నిలవగా, ఇదే పాఠశాలకు చెందిన డి. మధు 571, ఎ. భవిత 568తో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. పోలవరం జడ్పీహైస్కూల్లో పేద మత్స్యకార కుటుంబానికి చెందిన కర్నాటి కరుణశ్రీ 565 మార్కులు సాధించి నాల్గో స్థానంలో నిలిచింది. చాట్రాయి జడ్పీ హైస్కూల్ 96.5 శాతం ఫలితాలతో ప్రథమ స్థానంలో నిలవగా, చనుబండ హైస్కూల్ 73.5 శాతం ఫలితాలతో ఆఖరులో నిలిచినట్లు ఎంఈవో బ్రహ్మచారి తెలిపారు.

టెన్త్ ఫలితాల్లో త్రివిధ విద్యార్థుల ప్రతిభ


బండారు హాసిని


సాగి హర్షిత

నూజివీడు టౌన్, ఏప్రిల్ 22: 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో నూజివీడు త్రివిధ విద్యార్థులు ఉత్తమ ప్రతిభా పాటవాలు కనబరచినట్లు త్రివిధ ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. తమ పాఠశాలకు చెందిన బండారు హాసిని 594 మార్కులు సాధించగా, సాగి వర్షిత 593 మార్కులు, జల్లు దివాకర్ నిఖిత శ్రీ 592, పంబా లాలిత్య 591 మార్కులు సాధించారన్నారు. 194 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 193 మంది ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలిపారు.


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న పీవీ కుమార్

సత్తా చాటిన కుమార్ విద్యార్థులు

నూజివీడు టౌన్, ఏప్రిల్ 22: నూజివీడు కుమార్ విద్యాసంస్థల విద్యార్థులు 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభా పాటవాలు కనబర్చినట్లు పాఠశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ పి.సంధ్యాలక్ష్మి తెలిపారు. తమ పాఠశాలకు చెందిన హంసిల్‌బాబు 594, వైష్ణవి మదన్‌మోహన్‌లు 592, రోహిత్ 591, ధనుష్ 590 మార్కులు సాధించారన్నారు. 550 మార్కులకు పైబడి 68 మంది విద్యార్థులు సాధించగా, 500 మార్కులకు పైబడి 116 మంది సాధించారని గణితంలో, సోషల్లో నూటికి నూరు శాతం మార్కులు సాధించిన వారు 23 మంది విద్యార్థులు ఉన్నారన్నారు.

వైభవంగా ఊంజల్ సేవ



నూజివీడు టౌన్, ఏప్రిల్ 22: నూజివీడులోని గొల్లపల్లి రఘునాథ స్వామి కల్యాణోత్సవంలో భాగంగా సోమవారం స్వామివారికి డోలా మండపం వద్ద ఊంజల సేవ నిర్వహించారు. అనంతరం హనుమంత వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. తొలుత మంగళ వాయిద్యాలతో తీర్థపు బిందె, నిత్యార్చన, నిత్యహోమం, శ్రీమహాలక్ష్మి హవనం, బలిహరణ, నిత్యార్చన కార్యక్రమాలను ఆలయ అర్చకులు తట్టా సంతోష్, రోహిణి కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ ఈవో ఎన్.సతీష్‌కుమార్ పర్యవేక్షించారు.


కార్ల ర్యాలీకి జెండా ఊపుతున్న టీడీపీ నేతలు


చిన్నంపేట నుంచి ఏలూరు నామినేషన్‌కు వెళుతున్న టీడీపీ శ్రేణులు

మహేష్ యాదవ్ నామినేషన్‌కు తరలిన నాయకులు

కైకలూరు, ఏప్రిల్ 22: ఏలూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్ నామినేషన్‌కు కైకలూరు నియోజకవర్గం నుంచి ఎన్డీయే కూటమి నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లారు. సోమవారం కైకలూరు సీఎన్నార్ గార్డెన్ కల్యాణ మండపం నుంచి 100 కార్లు, 200 బైకులపై కార్యకర్తలు ర్యాలీగా కైకలూరు కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్, టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో వెళ్లారు. ఇంత పెద్దఎత్తున కార్యకర్తలు వెళ్లడం కూటమి నాయకుల్లో మరింత ఉత్సాహాన్ని నింపిందని కామినేని అన్నారు. టీడీపీ నాయకులు బీకేఎం నాని, పెన్మెత్స త్రినాథరాజు, పూల రామచంద్రరావు, బొమ్మనబోయిన విజయలక్ష్మి, జనసేన నాయకులు కొల్లి బాబి, తోట లక్ష్మి తదితరులు తరలివెళ్లారు.

చాట్రాయి: ఏలూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ నామినేషన్‌కు చాట్రాయి మండలం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ద్విచక్రవాహనాలు, కార్లలో బయలుదేరి వెళ్లారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, విజయ డెయిరీ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు, తెలుగురైతు నాయకులు పుచ్చకాయల నోబుల్‌రెడ్డి, మందలపు జగదీష్, మండల నాయకులు బొట్టు లక్ష్మణరావు, కలకొండ భాస్కరరావు, వెల్ది నాగేశ్వరరావు, చల్లగుళ్ళ రాజారత్నం, ఇజ్జిగాని వెంకటేశ్వరావు వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కామినేనితో జడ్పీటీసీ సభ్యురాలు బొర్రా సత్యవతి

కలిదిండిలో వైసీపీకి భారీ షాక్

టీడీపీ తీర్థం పుచ్చుకున్న జడ్పీటీసీ సత్యవతి

కలిదిండి, ఏప్రిల్ 22 : కలిదిండిలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. కలిదిండి జడ్పీటీసీ బొర్రా సత్యవతి సోమవారం రాత్రి తన స్వగ్రామమైన కొండూరులో కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్ సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఇప్పటి వరకు ఆరు నామినేషన్‌లు

నూజివీడు, ఏప్రిల్ 22: సోమవారం నాటికి నూజివీడు నియోజకవర్గంలో ఆరు నామినేషన్‌లు దాఖలు అయ్యాయి. ప్రధాన అభ్యర్థులైన సిట్టింగ్ ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి ప్రతాప్ అప్పారావు, టీడీపీ అభ్యర్థి పార్థసారధి ఇప్పటికే తమ తొలి సెట్ నామినేషన్లు దాఖలు చేశారు. మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. మరో ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు ఇప్పటివరకు నామినేషన్ వేశారు. 23న వైసీపీ అభ్యర్థి ప్రతాప్ అప్పారావు, 24న టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి జనసమీకరణతో అట్టహాసంగా మరోసారి తమ నామినేషన్‌లను దాఖలు చేయనున్నారు.



బాస్కెట్‌బాల్ పోటీల్లో ఫైనల్స్‌కు చేరిన జట్లు

నూజివీడు టౌన్, ఏప్రిల్ 22: రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ఫైనల్స్‌కు తూర్పుగోదావరి, అనంతపురం, బాలికల విభాగంలో పశ్చిమ గోదావరి, కృష్ణాజిల్లా జట్లు చేరాయి. అంతకు ముందు సెమీ ఫైనల్స్‌లో బాలుర విభాగంలో తూర్పుగోదావరి, విశాఖపట్నం జట్లు తలపడగా, 54-20 స్కోరుతో తూర్పుగోదావరి విజయం సాధించింది. ఇక 2వ సెమీఫైనల్స్‌లో అనంతపురం, పశ్చిమ జట్లు తలపడగా, 64-54 పాయింట్లతో అనంతపురం ఫైనల్స్‌కు చేరింది.


లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిన నూజివీడు వైసీపీ నాయకులు

వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు

నూజివీడు, ఏప్రిల్ 22: నూజివీడు ఉమ్మడి అభ్యర్థి కొలుసు పార్థసారధి ఆధ్వర్యంలో నూజివీడు వైసీపీకి చెందిన పలువురు కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, వైసీపీ నాయకులు భారీ సంఖ్యలో సోమవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఎంపీటీసీ తులిమెల్లి కృష్ణకుమారి, ముసునూరు మండల వైసీపీ నాయకుడు తులిమెల్లి రంగారావు, ఎంపీటీసీ చీలి లక్ష్మి, నూజివీడు మూడో వార్డు కౌన్సిలర్ షేక్ మీరా బాయ్, బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిల పంగడయ్య, ఏలూరు జిల్లా బీసీ సెల్ కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ ఖాజా రాంబాబు, మాజీ కౌన్సిలర్లు నత్తా నాగేశ్వరరావు, రెంటపల్లి రాజ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ పాలకుర్తి కోటయ్యతో పాటు పెద్దసంఖ్యలో వైసీపీ నాయకులు టీడీపీలో చేరగా, వారికి లోకేశ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

విద్యుత్ లైన్ల కింద వ్యర్థాలు కాల్చవద్దు

చాట్రాయి, ఏప్రిల్ 22: మొక్కజొన్న వ్యర్థాలను విద్యుత్ లైన్లు కింద తగలబెట్ట వద్దని విద్యుత్ ఏఈ సంజయ్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎటువంటి జాగ్రత్తలు లేకుండా మొక్కజొన్న వ్యర్థాలు తగలబెట్టడం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగటమే కాక, కేబుల్ వైర్లు, మోటార్లు, గడ్డి వాములు కాలిపోయి తీవ్ర నష్టం జరుగుతున్నదన్నారు.

క్రైం కార్నర్

జోరుగా జూదం.. పట్టించుకోని పోలీసులు

ముదినేపల్లి రూరల్, ఏప్రిల్ 22: రాత్రి, పగలు తేడా లేకుండా జోరుగా ముదినేపల్లి మండలంలో పేకాట నిర్వహిస్తున్నారు. పోలీసులు అనుమతి ఉందంటూ ప్రచారం చేయడంతో రాత్రి సమయాల్లో ఫ్లడ్‌లైట్లు వెలుగులో కోసు నిర్వహిస్తున్నారు. కోమట్రు కాలువగట్ల వెంబడి ప్రధాన రహదారులు వెంబడి ఈ పేకాట జరుగుతోంది. జూదరులను ఆకర్షించటానికి మూడు రోజుల కిందట భారీస్థాయిలో భోజనాలు ఏర్పాటుచేసి కార్లకు సైతం కోసు నిర్వాహకులు కిరాయి చెల్లిస్తున్నారు. గుంటూరు, మాచర్ల, విజయవాడ, మంగళగిరి, గన్నవరం తదితర ప్రాంతాల నుంచి భారీ స్థాయిలో జూదరులు తరలివస్తున్నారు. కాయిన్స్‌తో కోసు నిర్వహిస్తున్నారు. ఇంత పెద్దఎత్తున జూదం నిర్వహిస్తున్నా పోలీసులు తమకేమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

వివాహితపై అసభ్య ప్రవర్తన.. కేసు నమోదు

ముసునూరు, ఏప్రిల్ 22: వివాహితపై అభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై ముసునూరు ఎస్‌ఐ పి.వాసు ఆదివారం కేసు నమోదు చేశారు. మండలంలోని చింతలవల్లికి చెందిన వివాహిత మేకలను మేపుకుని పామాయిల్ తోటలో జీవాలకు నీరు పెట్టేందుకు వెళ్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన బోద్దుకోళ్ళ శ్యామ్‌కుమార్ ఆమెతో అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు బెదిరింపులకు పాల్పడ్డాడని బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చాట్రాయిలో గడ్డి వాము దగ్ధం



చాట్రాయి, ఏప్రిల్ 22: చాట్రాయి దళిత వాడలో సోమవారం బూరుగు సుజాతకు చెందిన గడ్డివాము దగ్ధమైంది. విస్సన్నపేట నుంచి అగ్నిమాపక శకటం వచ్చి మంటలు అదుపు చేసింది. రూ 50 వేలు నష్టం వాటిల్లిందని బాధితురాలు సుజాత ఆవేదన వ్యక్తం చేసింది.


ఆర్యవైశ్యుల సమావేశంలో మాట్లాడుతున్న పార్థసారథి

ఒక్క చాన్స్ ఇవ్వండి : పార్థసారథి

నూజివీడు, ఏప్రిల్ 22: నూజివీడు నియోజకవర్గంలో ఒకే వ్యక్తికి మూడుసార్లు అధికారం ఇచ్చారు. అయినా మీ ప్రధాన సమస్యలు ఎక్కడివక్కడే ఉన్నాయి. నాకు ఒక్కసారి ఛాన్స్ ఇచ్చి చూడండి గతంలో మంత్రిగా, శాసనసభ్యుడిగా నాకున్న అనుభవంతో నియోజకవర్గ సమస్యలు పరిష్కరిస్తానని నూజివీడు ఉమ్మడి అభ్యర్థి కొలుసుపార్థసారథి విజ్ఞప్తి చేశారు. ఆదివారం రాత్రి నూజివీడులో ఆయన ఆర్యవైశ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించి మాట్లాడుతూ వ్యాపారులను అధికారులు ఇబ్బందుల పాలుచేస్తే మీకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. దానశీలి మిర్యాల కనకభూషణం దానాలను ప్రజలకు గుర్తుండేలా ఆయన విగ్రహం కాని, లేదా ట్రిపుల్‌ఐటీలో ఒక బ్లాక్‌కు ఆయన పేరు పెట్టేలా చంద్రబాబును ఒప్పించి సాధిస్తానని తెలిపారు. పలువురు వైశ్యప్రముఖులు పాల్గొన్నారు.



వేసవిలో తాగునీటి సమస్య రానివ్వద్దు

ముసునూరు, ఏప్రిల్ 22: వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కొండా దుర్గాభవాని అన్నారు. సోమవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శాఖల పనితీరును అధికారులు వివరించారు. వైస్ ఎంపీపీ కోటగిరి రాజా, జడ్పీటీసీ డాక్టర్ ప్రతాప్ మాట్లాడుతూ ఎంపీడీవో సీహెచ్.పద్మావతిదేవి మాట్లాడుతూ ఉపాధి పథకంలో పనులు నిబంధనల ప్రకారం జరిగేలా సిబ్బంది పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ-2 పాముల గంగాధరరావు, మాజీ ఎంపీపీ రాపర్ల కృష్ణకుమారి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడికి పదవీ విరమణ సత్కారం

మండవల్లి, ఏప్రిల్ 22: మండలంలోని పెనుమాకలంక ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బలే శ్రీనివాసరావు పదవీ విరమణ సందర్భంగా సోమవారం పాఠశాలలో వీడ్కోలు సభ, సన్మానం నిర్వహించారు. ఎంఈవో-2 రామారావు పాల్గొన్నారు. ప్రముఖ కవి చింతపల్లి వెంకటనారాయణ, విశ్రాంత జిల్లా పంచాయతీ అధికారి బలే బాబురావు, ఉపాధ్యాయ యూనియన్ నాయకులు శ్రీనివాసరావు సేవలను కొనియాడారు.

ఎస్టీయూ ఆత్మీయ సమావేశం

ఆగిరిపల్లి, ఏప్రిల్ 22: ఎస్టీయూ మండల ఆత్మీయ సమావేశం సోమవారం ఆగిరిపల్లి జడ్పీ హైస్కూల్‌లో జరిగింది. విద్యార్థుల ప్రగతి, ఉపాధ్యాయుల సమస్యలపై పలువురు ఉపాధ్యాయులు చర్చించారు. జిల్లాపరిషత్ హైస్కూల్స్ నందు 10వ తరగతిలో సాధించిన ఫలితాలపై ప్రధానోపాధ్యాయులు పుష్పలత, తాడి ప్రసాద్, రాజు ప్రసంగించారు. ఎంఈవో సర్వేశ్వరరావు, ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.